


అనంత వెరీ పూర్..!


వృద్ధి రేటులో చాలా వెనుకబాటు

- రాష్ట్ర సగటు కంటే 0.01 శాతం తక్కువ
- జోన్-5 జిల్లాల్లో ఆరో స్థానం
- సమస్యల పరిష్కారంలో 23వ స్థానం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు
- ప్రగతి దిశగా సాగాలని దిశానిర్దేశం
- అభివృద్ధి ప్రణాళికను వివరించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్





మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

అనంతపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అక్షర క్రమంలో ముందున్నా.. వృద్ధిరేటు, సేవల్లో జిల్లా అత్యంత వెనుకబడి ఉంది. అమరావతిలో రెండో రోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఈ విషయంలో బహిర్గతమైంది. జోన్-5 జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం అభివృద్ధి ప్రణాళికల గురించి చర్చించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ జిల్లా ప్రగతి, ప్రణాళికపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జోన్-5 జిల్లాల్లో వృద్ధి రేటు, మూలధన వ్యయం, వివిధ శాఖల పనితీరు, ప్రజల సమస్యలు తదితర అంశాలు, కలెక్టర్ల పనితీరును విశ్లేషించారు. బెంగళూరు ఎయిర్‌పోర్టు ఉమ్మడి జిల్లాకు అతి సమీపంలో ఉందని, ఈ కారణంగా సత్యసాయి జిల్లా అభివృద్ధి చెందుతోందని అన్నారు. కియ ఏర్పాటు కూడా ఆ జిల్లాలో మార్పు తెచ్చిందని అన్నారు. అనంతపురం జిల్లా కూడా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా వృద్ధి రేటు 12.01 శాతం ఉందని, రాష్ట్ర వృద్ధి రేటుకంటే 0.01 శాతం వెనుకబడి ఉందని అన్నారు. జోన్-5 జిల్లాలతో పోలిస్తే వృద్ధిరేటులో ఆరో స్థానంలో ఉందని అన్నారు. వృద్ధిరేటును 15 శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ శాఖల ఫైళ్ల పరిష్కారం, భూ సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో అనంతపురం జిల్లా 23వ స్థానంలో ఉండటం గమనార్హం. మొత్తంగా అభివృద్ధి, అధికారుల పనితీరు(సేవలు)లో జిల్లా పరిస్థితి దారుణంగా ఉందని స్పష్టమౌతోంది.

సమస్య తలెత్తకూడదు..

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సీఎం చంద్రబాబు కలెక్టర్‌ను ఆదేశించారు. పశువులకు దాణా కొరత లేకుండా చూడాలని, కరువు నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా పరిశ్రమలకు అనువైన ప్రాంతమని, ఆ దిశగా దృష్టి సారించాలని సూచించారు. హంద్రీనీవా గేమ్ చేంజర్ అని, దీన్ని దృష్టిలో పెట్టుకుని చెరువులన్నింటికీ నీరివ్వాలని, వ్యవసాయరంగాన్ని మరింత ప్రోత్సహించాలని ఆదేశించారు.

లక్ష్యాలను చేరుకుంటాం: కలెక్టర్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి జిల్లా కార్యచరణ ప్రణాళికను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సీఎం చంద్రబాబుకు వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవా రంగంలో 15 శాతానికిపైగా వృద్ధి సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేశామని తెలిపారు.

సేద్యానికి చేయూత

నేల ఆధారిత ఎరువులు, సూక్ష్మ పోషణపై దృష్టి పెట్టామని తెలిపారు. జడ్‌బీఎన్‌ఎఫ్ కింద సేంద్రీయ వ్యవసాయాన్ని 35 వేల హెక్టార్లకు విస్తరిస్తామని తెలిపారు. భూసార పరీక్షలు 18,800 నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. గ్రామస్థాయిలో కస్టమ్‌హైరింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి, 35 కిసాన్ డ్రోన్లు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని అన్నారు. 143 గ్రామ పంచాయతీల్లో 69,710 మంది రైతులకు సంబంధించి 33,243 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఉద్యానశాఖ పరిధిలో 15,500 హెక్టార్లల్లో సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు.

పశువులు... పచ్చదనం

పశుసంవర్ధక శాఖ పరిధిలో 48.56 లక్షల ఎనుములు, ఆవులు, గొర్రెలు, ఆవులు, మేకలు, కోళ్ల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 51 లక్షల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 120 హెక్టార్ల అటవీభూముల్లో పచ్చదనం పెంచుతామని, 12 లక్షల మొక్కలను నర్సరీల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. 225 హెక్టార్లల్లో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపడతామని తెలిపారు. మైనర్ ఇరిగేషన్, రిజర్వాయర్లల్లో 1,000 నుంచి 2,500 హెక్టార్లల్లో చేపపిల్లల పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు.

పారిశ్రామిక ప్రగతి దిశగా..

ఖనిజ ఆదాయాన్ని రూ.70 కోట్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమల శాఖ పరిధిలో తయారీ రంగంలో రెండు పెద్ద యూనిట్లతో పాటు ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుం కింద కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేస్తామని తెలిపారు. హంద్రీనీవా విస్తరణ, ఎన్‌హెచ్-544డి పనులను గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.

గుత్తి కోటలో సాహస క్రీడలు

జిల్లాలో పర్యాటకం కింద మూడు క్లస్టర్లు, మూడు సర్క్యూట్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ అన్నారు. గుత్తి కోటకు వెళ్లేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, అక్కడ సాహస క్రీడలను, ఇతర కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణను నెల రోజుల్లోపు పూర్తి చేస్తామని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో రూ.23 కోట్లకు రుణ సౌకర్యం కల్పించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు.

ఈకేవైసీ గుబులు..!

- రేషన్‌కార్డుదారుల్లో ఆందోళన
- జిల్లాలో 2,36,436 మంది పెండింగ్
- 31 వరకు గడువు
- చేయించుకోకపోతే సరకులు కట్



రేషన్ బండి వద్ద సరకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

అనంతపురం టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ పెద్ద సమస్యగా మారిపోయింది. కార్డులో ఉన్న సభ్యులందరూ తప్పనిసరగా ఈకేవైసీ చేయించుకోవాలని కేంద్రం నిబంధన పెట్టింది. ఈకేవైసీ చేయించుకుంటే కార్డులో ఉన్న సభ్యులు ఉన్నారా, లేదా అని తెలిసిపోతుంది. చిన్నపిల్లలుగా ఉన్నపుడు పలువురు కార్డులో సభ్యులుగా చేరి ఉంటారు. అలాంటి పిల్లలందరూ ఈకేవైసీ చేయించడం వల్ల అప్‌డేట్ అవుతుంది. ఈ నేపథ్యంలో కార్డుదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో 6.35 లక్షల రేషన్ కార్డులున్నాయి. వీటిలో 20,11,076 మంది సభ్యులున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధన మేరకు వీరందరూ ఈకేవైసీ చేయించుకోవాలి. ఇప్పటివరకు 17,74,640 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 2,36,436 మంది చేయించుకోలేదని జిల్లా యంత్రాంగం చెబుతోంది. ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోకపోతే ఏప్రిల్‌లో రేషన్ సరకులు ఇవ్వరని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఇన్‌చార్జి డీఎస్‌ఓ జగన్నాథరావు పదేపదే చెబుతూ ప్రకటనలు ఇస్తున్నారు.

లబ్ధిదారుల్లో టెన్షన్

అధికార యంత్రాంగం తీరుతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. చాలామంది కార్డుల్లో ఉన్న విద్యార్థులు చదువుల కోసమని వివిధ ప్రాంతాలకు వెళ్లారు. ప్రస్తుతం పరీక్షల సీజన్ కొనసాగుతోంది. ఆ విద్యార్థులందరూ పరీక్షలపైనే దృష్టి పెట్టి చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు సైతం పరీక్షల సమయంలో తమ పిల్లలను ఇబ్బది పెట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. కొందరైతే ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో చదువుకుంటున్నారు. అలాంటి సమయంలో నెలాఖరులోగా ఈకేవైసీ చేయించాలనీ, లేకపోతే వచ్చేనెల నుంచి రేషన్ సరకులు ఇవ్వమని చెప్పడంపై లబ్ధిదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల వితండ వాదన

నిబంధనలతో కార్డుదారులు ఆందోళన చెందుతుంటే.. అధికారులు మాత్రం వితండవాదనలు వినిపిస్తున్నారు. ఎక్కడున్నా రేషన్ షాపు డీలర్లు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ, వార్డు సచివాలయం, ఈపోస్ మిషన్‌లో ఈకేవైసీ చేయించుకోవచ్చంటున్నారు. విద్యార్థులకు ఆయా ప్రాంతాల్లో రేషన్ షాపులు, రెవెన్యూ అధికారి, సచివాలయాలు ఎక్కడుంటాయో తెలీదు. పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇలాంటి సమయంలో బయటకు వెళ్లే అవకాశం ఉండదు. ఇతర రాష్ట్రాల్లో సచివాలయాలు ఉన్నాయో.. లేదో.. తెలీదు. ఇక్కడ అధికారులు మాత్రం నెలాఖరులోగా ఎక్కడో ఒకచోట ఈకేవైసీ చేయించుకోవాల్సిందేననీ, లేకపోతే సరకులు కట్ చేస్తామని అంటున్నారు. ఇది కార్డుదారులకు మరింత ఇబ్బందిగా మారింది.

ఈకేవైసీ చేయించుకుంటేనే సరుకులు



రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈ విషయాన్ని కొన్ని రోజులుగా చెబుతున్నాం. ఇప్పటికీ జిల్లాలో 2,36,436 మంది ఈకేవైసీ చేయించుకోలేదు. నెలాఖరు వరకు అవకాశం ఉంది. తాము ఉన్న ప్రాంతాల్లో రేషన్ డీలర్, గ్రామాధికారి, సచివాలయ సిబ్బంది, పౌరసరఫరాల డీటీ వద్ద ఈకేవైసీ చేయించుకోవచ్చు. నెలాఖరులోగా కార్డులో ఎంతమంది సభ్యులు ఈకేవైసీ చేయించుకున్నారో అంతమందికే వచ్చే నెల నుంచి సరకులు అందుతాయి.

- జేసీ శివనారాయణ శర్మ

మార్చురీలో నాన్న..
పరీక్షాకేంద్రంలో కూతురు..

- విషాదాన్ని దాచిన కుటుంబీకులు
- పరీక్ష ముగియగానే నేరుగా మార్చురీ వద్దకు..
- నిర్జీవంగా తండ్రి.. చూసి గొల్లుమన్న బిడ్డ



నాన్నను చూసేందుకు కారులో వెళ్తున్న విద్యార్థిని

అనంతపురం విద్య, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబానికి విషమ పరీక్ష ఎదురైంది. ఒకవైపు తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించగా, మరోవైపు కుమార్తె పదో తరగతి పరీక్షలు రాస్తోంది. దీంతో విద్యార్థిని ఎలాగైనా సజావుగా పరీక్ష రాసేందుకు.. కుటుంబీకులు మౌనంగా వేదన భరించారు. మధ్యాహ్నం 11.30 గంటలకు పరీక్ష రాయగానే.. నేరుగా విద్యార్థినిని తండ్రి మృతదేహం ఉన్న మార్చురీ వద్దకు తీసుకెళ్లారు. ఈ హృదయ విదారక ఘటన బుధవారం జిల్లాలో జరిగింది. ఉరవకొండ మండలం రాకెట్లకు చెందిన మదమంచి రాఘవేంద్ర, లత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ప్రణీత ఇటీవలే ఇంటర్ సెకండియర్ పూర్తి చేసుకుంది. కూతురిని ఎంసెట్ షార్ట్ టర్మ్ కోచింగ్ కోసమని అనంతపురానికి మంగళవారం తీసుకొచ్చి, రాత్రి 7 గంటల సమయంలో బైక్‌లో రాఘవేంద్ర స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కూడేరు మండలం గొటుకూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం తరలించేసరికి మరణించారు. చిన్న కుమార్తె రక్షితకు ఉదయం పదో తరగతి పరీక్ష ఉండటంతో... విద్యార్థినికి తండ్రి మృతి విషయం చెప్పకుండా దాచారు. బాధలో పరీక్షలు సరిగా రాయకుండా పోతుందోనని కుటుంబీకులు, బంధువులు బాధను తమలోనే దాచుకున్నారు. విద్యార్థిని రక్షిత కొవ్వూరునగర్‌లోని నారాయణ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఫిజికల్ సైన్స్ పరీక్ష రాసి, బయటకు రాగానే.. తాత అశోక్, బంధువులు కారులో నేరుగా రాఘవేంద్రను ఉంచిన సర్వజనాసుపత్రి మార్చురీ వద్దకు తీసుకెళ్లారు. నిర్జీవంగా పడివున్న తండ్రిని చూసి రక్షిత బోరున విలపించింది.

పారదర్శకతకు పాతర..!

వివరాలు 6లో...

కవ్వింపులు.. క్యాంపులు..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీ అయిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు గురువారం ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులోనూ వైసీపీ కవ్వింపులకు తెరలేపింది. తమ పార్టీ మద్దతు సభ్యులు ఎక్కడ చేజారిపోతారోనన్న ఆందోళనతో దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అంతేకాదు, తమ సభ్యులను ఇప్పటికే శిబిరాలకు తరలించింది. రామగిరి ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో బుధవారం ఆ మండల పరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ వర్గీయుల వాహనాలను వైసీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికపై సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఎక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతాయోనని యంత్రాంగం ఆందోళన చెందుతోంది. పోలీసులు పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

వివరాలు 6లో..

7 టీడీపీ, వైసీపీ ఘర్షణ

రబీలోనూ నష్టమే..!

- తెగుళ్లతో తగ్గిన వేరుశనగ దిగుబడి
- పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి
- అప్పుల ఊబిలోకి అన్నదాతలు



వేరుశనగ పంటను తొలగిస్తున్న కూలీలు

అనంతపురం అర్బన్/గుత్తిరూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగుచేసే వేరుశనగ పంట అతివృష్టి, అనావృష్టి కారణాలతో దెబ్బతినడం మామూలే. రబీలో బోరుబావుల కింద పెట్టే పంట మాత్రం రైతులకు ఉపశమనాన్నిస్తుంది. పెట్టుబడితో పాటు కనీస లాభాలను తెచ్చిపెడుతుంది. పంటకు నీరు పెట్టే అవకాశం ఉండడంతో రైతులకు రబీపై పూర్తి నమ్మకం. ఈసారి రబీలో కూడా పంట దెబ్బతింది. తెగుళ్ల కారణంగా దిగుబడి దారుణంగా పడిపోయింది. దీనికితోడు మార్కెట్‌లో ధర కూడా తగ్గింది. దానిని ఆసరాగా చేసుకుని, దళారులు ధరలను మరింత తగ్గించారు. వెరసి, అన్నదాత పెట్టుబడులు కూడా నష్టపోయి, నష్టాలు మూటగట్టుకుంటున్నాడు.

కోలుకోలేని దెబ్బ

ఖరీఫ్ సీజన్‌లో మెట్టలో వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగ పంట కీలక దశల్లో వర్షం పడకపోవడంతో దిగుబడి భారీగా తగ్గింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట సైతం దిగుబడులు తగ్గడంతో మళ్లీ అన్నదాతలకు నష్టాలే మిగిలాయి. దిగుబడి తగ్గడంతో పాటు ధరలు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడం అన్నదాతను కోలుకోలేని దెబ్బతీసింది.

మచ్చ తెగులుతో తగ్గిన దిగుబడి

జిల్లావ్యాప్తంగా 2024-25 రబీ సీజన్‌లో 8 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. గతేడాది అక్టోబరులో రబీ సీజన్ ఆరంభమైంది. నవంబరులో వాతావరణంలోమార్పులు, తుఫాను ప్రభావంతో రబీలో సాగుచేసిన వేరుశనగ పంట ఎదుగుదలను కోల్పోయింది. పూత, పిందె దశల్లో మచ్చతెగులు, లద్దెపురుగు ఆశించడంతో దిగుబడి భారీగా తగ్గింది. మచ్చతెగులు కారణంగా గరిక పిందె పడింది. కాయ ఊరకుండా అలాగే ఉండిపోయింది. ఈ కారణాలతో దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదని రైతులు వాపోతున్నారు. గుత్తి, కూడేరు, ఆత్మకూరు, గార్లదిన్నె, గుంతకల్లు తదితర మండలాల్లో ఎక్కువ శాతం రైతులు దిగుబడి తగ్గడంతో తీవ్రంగా నష్టపోయారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా 90 శాతానికిపైగా వేరుశనగ కోతలు పూర్తయ్యాయి. బోరుబావుల కింద బాగా పండితే ఎకరాకు 25 నుంచి 30 బస్తాల దాకా దిగుబడి వస్తుంది. ఈసారి తెగుళ్ల ప్రభావంతో ఎకరాకు 7 నుంచి 10 బస్తాలలోపే దిగుబడి వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో అంతకంటే తక్కువగానే వచ్చినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. గుత్తి రూరల్ మండలవ్యాప్తంగా 500 హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. దిగుబడి రాకపోవడంతో కొందరు రైతులు వేరుశనగ పంటను ట్రాక్టర్లతో తొలగిస్తున్నారు. చెట్టుకు ఒకట్రెండు కాయలు, గరిక పిందెలు మిగిలాయని వారు వాపోతున్నారు.

ధర కూడా..

సాధారణంగా పంట దిగుబడులు తగ్గితే ధర పెరగాల్సి ఉంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో వేరుశనగ దిగుబడులు తగ్గినా.. ధర కూడా తగ్గడం గమనార్హం. కొందరు దళారులు కుమ్మక్కై ధరను తగ్గించి రైతులకు అన్యాయం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. గతేడాది బస్తా (45 కేజీలు) రూ.3100 నుంచి రూ.3300 వరకు పలికింది. ఈసారి రూ.2400 నుంచి రూ.2600లోపే అమ్ముడుపోతోంది. ఎకరాలో వేరుశనగ సాగు చేసేందుకు రూ.40 వేల నుంచి రూ.45 వేలదాకా ఖర్చు చేశారు. దిగుబడులు తగ్గడంతో పాటు ఆశించిన మేర ధర లేకపోవడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా మిగలడం లేదు. దీంతో బాధిత రైతులు ఏం చేయాలో తోచక గుండెలు బాదుకుంటున్నారు.

రబీలోనూ నిరాశ తప్పలేదు



రబీ సీజన్‌లో రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశా. చెట్టుకి రెండు, మూడు కాయలు మాత్రమే ఉన్నాయి. మిగిలినవి గరిక పిందెలు పడ్డాయి. ఈసారి తెగుళ్లతో వేరుశనగ దిగుబడి రాకపోవడంతో పూర్తిగా నష్టపోయా. పశువులకు మేత మాత్రమే మిగిలింది.

- గోవిందు, బసినేపల్లి తండా, గుత్తి రూరల్ మండలం

దిగుబడి తగ్గింది



మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. గతేడాది నవంబరులో తుఫాను దెబ్బకు మచ్చ తెగులు, లద్దెపురుగు ఆశించడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఈసారి దిగుబడి పూర్తిగా తగ్గింది. రూ.లక్ష పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయా.

- నాగర్జున, తొండపాడు, గుత్తి రూరల్ మండలం

కవ్వింపులు... క్యాంపులు

- ఉప ఎన్నికల్లోనూ వైసీపీ కుట్రలు
- నేడు ఖాళీపడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి
- అధికారుల నియామకం
- ఉమ్మడి జిల్లాలో 5 ఎంపీపీ, నాలుగు చొప్పున వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ ఖాళీలు
- రామగిరిలో ఘర్షణ
- టీడీపీ వర్గీయుల వాహనాలు ధ్వంసం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అరెస్టు
- కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



జడ్పీ కార్యాలయం

పుట్టపర్తి/అనంతపురం విద్య, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీపడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు నిర్వహిస్తున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు కవ్వింపులకు పాల్పడుతున్నారు. ఆయా పదవులను దక్కించుకోడానికి ఘర్షణలు, దాడులకు దిగుతున్నారు. దీంతో రెండు పార్టీల నేతల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. రామగిరిలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం, ఘర్షణ ఆఖరికి దాడుల వరకూ వెళ్లింది. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని సోమందేపల్లిలో అరెస్టు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9 మండలాల్లో ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో హైటెన్షన్ నెలకొంది. అలాగే నాలుగు ఉప సర్పంచ్ స్థానాలకూ ఎన్నిక నిర్వహించనున్నారు.

టీడీపీ వెంట వస్తారనే...

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక చాలాచోట్ల వైసీపీ నుంచి నాయకులు కూటమి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు సైతం అడుగేస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కవ్వింపు చర్యలతోపాటు, దాడులకు దిగుతున్నారు. రామగిరిలో ఇదే జరిగింది. బుధవారం రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు రెచ్చగొట్టడంతో ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో పరస్పర దాడులు కారణంగా ఇరువర్గాల వాహనాలు ధ్వంసమయ్యాయి. సోమందేపల్లిలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఎన్నికలు సజావుగా సాగకుండా చేయాలనే కుట్రలో భాగంగా వైసీపీ మూకలు ఇలా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. రెండు జిల్లాల అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలు కూడా అమర్చారు.

9 స్థానాలకు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9 స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల పలు కారణాల వల్ల ఖాళీ పడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు నేడు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి ఉప ఎన్నికల నిర్వహణకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జడ్పీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 9 మండలాలకు ఎన్నికల అధికారులను నియమించారు. గురువారం ఉదయం 10 నుంచి ఒంటి గంట మధ్య ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. తొమ్మిది మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికలు నిర్వహించనున్నారు.

రామగిరిలో..

రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలుండగా.. 9 వైసీపీ, ఒకటి టీడీపీ నెగ్గింది. వైసీపీ నుంచి ఎంపీపీగా ఎన్నికైన నాగమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వైసీపీ నుంచి ఎన్నికైన సభ్యుల్లో ముగ్గురు టీడీపీ వైపు మొగ్గుచూపినట్లు సమాచారంతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. గురువారం నేరుగా ఎంపీటీసీలను మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చేలా వైసీపీ నాయకులు ఎత్తుగడ వేశారు. ఈనేపథ్యంలో బుధవారం విప్ జారీ చేయాలంటూ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన వైసీపీ నాయకులు.. టీడీపీ వర్గీయుల వాహనాలను ధ్వంసం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎంపీపీ ఎంపికపై ఉత్కంఠ నెలకొంది.

గాండ్లపెంటలో..

మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఎంపీపీ జగన్మోహన్ రాజీనామాతో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఐదుగురు వైసీపీ, ఇద్దరు టీడీపీ మద్దతుదారులు ఉన్నారు. వైసీపీ మద్దతుదారుల్లో ఇద్దరు టీడీపీకి అనుకూలంగా ఓటేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ టీడీపీ మద్దతు అభ్యర్థే అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. వైసీపీ మద్దతుతో గెలిచి, సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ఎంపీటీసీ సభ్యుడిని ఎంపీపీగా ఎన్నుకునే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన నలుగురిని క్యాంపునకు తరలించారు.

వైసీపీలోనే వార్

రొద్దం ఎంపీపీ ఎన్నిక విషయంలో వైసీపీలోనే వార్ నడుస్తోంది. స్థానాన్ని కైవశం చేసుకునేందుకు వైసీపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. రొద్దం మండలంలో ఉశశ్రీ వర్గం ఒకవైపు, శంకర్‌నారాయణ వర్గం ఒకవైపు తమ వర్గానికి ఎంపీపీ స్థానం దక్కాలంటూ ఎవరికి వారు పావులు కదుపుతున్నారు. పెనుకొండ మండలంలోని రాంపురం పంచాయతీలోని వార్డు సభ్యురాలు నవతాబాయి కొంతకాలం క్రితం రాజీనామా చేశారు. ఏడాది క్రితం రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతిచెందారు. రొద్దం మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఎంపీపీ మృతితో 14 మంది ఉన్నారు. వారిలో ఉషశ్రీ వర్గీయులు నలుగురు, శంకర్ నారాయణ వర్గానికి చెందిన ఏడెనిమిది మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీపీ స్థానం ఎస్సీకి రిజర్వ్ కావడంతో కలిపి ఎంపీటీసీ వనజ, చిన్నమంతూరుకు చెందిన నాగమ్మ ఎంపీపీ బరిలో ఉన్నారు. నాగమ్మ పేరు ప్రస్తావనలో ఉన్నట్లు తెలుస్తోంది. నాగమ్మ, వనజలో ఎవరు ఎంపికవుతారని ఉత్కంఠ నెలకొంది.

కంబదూరులో..

ఎంపీపీగా రెండున్నరేళ్ల పాటు కొనసాగిన తలారి తిమ్మరాజమ్మ రాజీనామా ఇవ్వడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మండలంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. వారిలో ఒకరు మృతిచెందారు. దీంతో 14 మంది ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీని ఎన్నుకుంటారు. వీరంతా వైసీపీ మద్దతులోనే గెలిచారు. తమ సభ్యులు ఎక్కడ జారిపోతారోనన్న భయంతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. 10 మంది ఎంపీటీసీ సభ్యులను నాలుగు రోజుల క్రితమే విహారయాత్రకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈనెల 25న ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఒక్క సభ్యుడు కూడా హాజరుకాలేదు. మొత్తం సభ్యుల్లో నలుగురు టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఆ నలుగురే కీలకంగా మారి, మిగతా ఎంపీటీసీ సభ్యులను టీడీపీ వైపు తీసుకొచ్చే అవకాశాలు లేకపోలేదు. దీంతో ఆ నలుగురి కదలికలపై వైసీపీ నాయకులు నిఘా వేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ కండువా వేసుకుని, ఆ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండలంలోని రాళ్లఅనంతపురం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు కురుబ లక్ష్మీదేవమ్మను ఎంపీపీగా ఎన్నుకునే అవకాశాలున్నాయి.

ముందస్తు ఎన్నిక

కణేకల్లు ఎంపీపీగా పనిచేసిన సంధ్య రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటిలో 17 స్థానాలను వైసీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఒకచోట టీడీపీ మద్దతు అభ్యర్థి గెలిచారు. ఈ నేపథ్యంలో ఎంపీపీగా వైసీపీ మద్దతు అభ్యర్థి ఎన్నికవడం ఖాయంగా కనిపిస్తోంది. ఎంపీపీ ఎస్సీ జనరల్ రిజర్వేషన్ కేటాయించారు. ఒకరు రాజీనామా చేయగా.. ఇంకా ఇద్దరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సభ్యులున్నారు. వారిలో ఎవరిని ఎంపీపీ చేయాలన్న విషయమై వైసీపీ నేతల ఆధ్వర్యంలో మండలంలోని ఓ గ్రామంలో ఎన్నిక నిర్వహించుకున్నట్లు తెలిసింది. గరుడచేడు ఎంపీటీసీ సభ్యుడు వంద్రయ్యకు 12 మంది, మరో ఎంపీటీసీకి ఇద్దరు మాత్రమే మద్దతు తెలిపారు. దీంతో వంద్రయ్య ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించే స్థానాలు..

జిల్లా	ఎంపీపీ స్థానాలు	వైస్ ఎంపీపీ స్థానాలు
అనంతపురం	కణేకల్లు కంబదూరు	ఉరవకొండ-2 యల్లనూరు పెద్దపప్పూరు రాయదుర్గం
శ్రీసత్యసాయి	గాండ్లపెంట రొద్దం రామగిరి	

నాలుగు ఉప సర్పంచ్ స్థానాలకూ..

ఉమ్మడి జిల్లాలో నాలుగు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ స్థానాలకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లాలో పామిడి మండలం రామగిరి, వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఉప సర్పంచ్ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో పెనుకొండ మండలం రాంపురం, మడకశిర మండలం కల్లుమర్రి ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9 మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలకు ఏర్పాట్లు చేశాం. ఎన్నికల, ప్రిసైడింగ్ అధికారులను నియమించాం. ఎన్నికలున్న అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు వీడియోగ్రఫీ కూడా తీయిస్తున్నాం. ఎన్నికలు సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం.

-రామచంద్రారెడ్డి, జడ్పీ సీఈఓ, అనంతపురం

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ రత్న



జిల్లాలో ఎంపీపీ, ఉపసర్పంచ్ ఎన్నికల సందర్భంగా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న హెచ్చరించారు. గురువారం జిల్లాలో మూడు ఎంపీపీ, రెండు ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నిక సమయంలో 30 పోలీసు యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉంటాయన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెడతామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

దర్యాప్తు స్టేటస్ రిపోర్టు మా ముందుంచండి: హైకోర్టు

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండగా న్యాయవాది బీవీ శేషాద్రి మృతిచెందిన వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు స్టేటస్ రిపోర్ట్‌ను తమ ముందు ఉంచాలని పోలీసులకు స్పష్టం చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర డీజీపీ, అనంతపురం జిల్లా ఎస్పీ, అనంతపురం మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు నోటీసులు జారీచేసింది. పోలీసులు సమర్పించే నివేదిక సంతృప్తికరంగా లేకుంటే సీబీఐ విచారణకు ఆదేశిస్తామని స్పష్టం చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది బీవీ శేషాద్రి గతేడాది డిసెంబరులో మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండగా మరణించారు. ఈ ఘటనపై హైకోర్టు పర్యవేక్షణలో మేజిస్ట్రేట్‌తో విచారణ జరిపించి, నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ అధీకృత ప్రతినిధి జి.రంగనాయకులు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. న్యాయవాది మృతిపై అనుమానాలున్నాయని సోదరి ఫిర్యాదు చేసిందని చెప్పారు. ఘటన జరిగిన రోజు పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వాలని కోరగా, పోలీసులు నిరాకరిస్తున్నారన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఘటనపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

పారదర్శకతకు పాతర..!

- డ్వామా బదిలీల్లో విచిత్రాలు
- ఆ 8 మంది ఏపీఓలు తిరిగి తెరపైకి..
- వైసీపీ హయాంలో నిబంధనలకు తూట్లు
- అదే బాటలో హెచ్ఆర్ విభాగం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్ఓ, డ్వామా పీడీ (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డ్వామాలో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా చేస్తున్నామంటూనే కొందరు అధికారులు కౌన్సెలింగ్‌ను అనుకూలంగా మార్చుకున్నారు. తమకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులను ఎంచుకున్న స్థానంలోకి చేర్చడానికి డ్వామాలో హెచ్ఆర్‌తో పాటు కొందరు అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. పేరుకే కౌన్సెలింగ్ జరిగిందని, తెరవెనుక వేరే వ్యవహారాలు నడిచాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులకు ఎందుకంత ప్రేమో అన్న చర్చ జరుగుతోంది. ఏళ్లుగా పాతుకుపోయినా అదే స్థానంలో కొనసాగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లు ఇలా ఉద్యోగుల బదిలీల్లో చిత్రవిచిత్రాలు కనబడుతున్నాయి. టీఏలలో చివరిలో ఉండే వ్యక్తికి జిల్లా కేంద్రంలోని స్థానాన్ని ఎలా కేటాయిస్తారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక సరిహద్దులోని ఓ మండలంలో పనిచేస్తున్న ఉద్యోగి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండే మండలానికి రావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తోటిఉద్యోగులే చెబుతున్నారు. ఇందుకు హెచ్ఆర్‌తో పాటు పలువురు అధికారులు సహకస్తున్నారని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లు సుమారు 25 మందికి పైగా పీడీ కార్యాలయానికి అక్రమమార్గంలోనే డెప్యుటేషన్ పేరుతో వచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వారిని కదిలించకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాజా బదిలీల్లో విచిత్రాలు

డ్వామాలో ఇటీవల చేసిన బదిలీల్లో అన్నీ విచిత్రాలే కనిపిస్తున్నాయి. హెచ్ఆర్ విభాగంలో ఉన్న ఉద్యోగులే బదిలీలను శాసించారు. డ్వామా కీలక అధికారిని కీలుబొమ్మగా మార్చేసి కొందరు అధికారులు వారి కనుసన్నల్లోనే కౌన్సెలింగ్ చేపట్టినట్లు తెలుస్తోంది. టెక్నికల్ అసిస్టెంట్లలో చివరిలో ఉండే వారికి సైతం జిల్లా కేంద్రానికి అతిసమీపంలో స్థానం కల్పించారు. మొదటి వరుసలో ఉన్నవారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీలకు ముందురోజే వ్యూహాత్మకంగా తమ ప్రణాళికను అమలు చేశారని ఉద్యోగులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అనంతపురం రూరల్, కూడేరులో ఈసీ పోస్ట్ ఖాళీగా ఉన్నప్పటికీ జాబితాలో చూపలేదు. హెచ్ఆర్‌లో ఒకరు ఆరేళ్లు, మరొకరు ఎనిమిదేళ్లుగా ఒకే స్థానంలో ఉంటూ డ్వామాను శాసిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తెరపైకి ఆ 8 మంది బదిలీలు..

గత సంవత్సరం ఆగస్టులో అప్పటి పీడీ ఎనిమిది మంది ఏపీఓలను బదిలీ చేశారు. ఎందుకు, ఎవరి సిఫారసుతో బదిలీ చేశారో అర్థం కాని పరిస్థితి. ఆ ఎనిమిది మంది ఏపీఓలకు స్థానచలనం కల్పించాలని డ్వామా అధికారులు యత్నిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో బదిలీ అయిన వారిలో పుట్లూరు నుంచి బొమ్మనహాల్‌కు భాగ్యలక్ష్మి, ఆత్మకూరు ఏపీఓ పుష్పావతి కళ్యాణదుర్గానికి బదిలీ చేయగా విధుల్లో చేరారు. మిగిలిన వారిలో.. పీడీ కార్యాలయంలో డెప్యుటేషన్‌పై ఉన్న ఆదినారాయణమ్మను తాడిపత్రికి, రాప్తాడు ఏపీఓ ఓబన్నను డి.హీరేహాల్‌కు, కూడేరు ఏపీఓ సుజాతను కంబదూరుకు, గార్లదిన్నె ఏపీఓ మురళీకృష్ణను బెళుగుప్పకు, తాడిపత్రి ఏపీఓ రాజ్యలక్ష్మిని బ్రహ్మసముద్రానికి, పామిడి ఏపీఓ విజయభారతిని రాయదుర్గానికి బదిలీ చేశారు. ఆ ఎనిమిది ఏపీఓలు బదిలీపై వెళ్లేందుకు ఇప్పటికే స్థానాలు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఆయా స్థానాల్లో వేరే ఏపీఓలు ఉన్నా సరే.. వాళ్లను వేరు మండలాలకు పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. నార్పలలో ఇద్దరు ఏపీఓలు ఉండగా.. ఒకరిని పంపాలని చూస్తున్నారు. బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె, శింగనమల, యల్లనూరు మండలాలకు వారిలో ఐదుగురు ఏపీఓలను రప్పించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో బదిలీల నిబంధనలను తుంగలోతొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇప్పుడు కూడా అదేబాటలో పయనించడంపై కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం



డ్వామాలో అన్నీ నిబంధనల ప్రకారమే చేస్తున్నాం. ఇన్‌చార్జిలు, డెప్యుటేషన్లు, బదిలీలు ఇలా ప్రతిదీ సీఆర్‌డీ, జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి పొందాకే అమలు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా చేయడానికి అవకాశమే లేదు. సీఆర్‌డీ గైడ్‌లైన్స్ ప్రకారమే ఉపాధి ఉద్యోగులను కౌన్సెలింగ్ ద్వారా స్థానచలనం కల్పించాం. గతంలో జరిగిన పరిణామాలకు ప్రస్తుతం పారదర్శకంగా చేపట్టే బదిలీలకు సంబంధం లేదు.

- సలీంబాషా, పీడీ, డ్వామా

నేడు సతామి

- రంజాన్ మాసంలో పవిత్రమైన రోజుగా ముస్లింల విశ్వాసం
- ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి వచ్చిన రోజు
- ఉపవాసం, జాగరణ చేయనున్న ముస్లింలు



పుట్టపర్తి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 27వ రోజు సతామీ (లైలతుల్ ఖద్ర్)గా చేసుకుంటారు. ప్రస్తుత రంజాన్ మాసంలో గురువారం సతామీ నిర్వహించుకుంటారు. ఈ రోజున పవిత్ర గ్రంథం ఖురాన్ దివి నుంచి భువికి వచ్చినట్లు ముస్లింలు భావిస్తారు. ఆరోజు రాత్రి జాగరణ, ప్రార్థనలు చేస్తూ గడుపుతారు. ఈ ఒక్కరాత్రి భక్తితో ప్రార్థనలు చేసేవారికి 83 ఏళ్ల ప్రార్థనలు చేసిన ప్రతిఫలం దక్కుతుందని ముస్లింల నమ్మకం. ఈ రాత్రిచేసే ప్రార్థనల వల్ల సర్వపాపాలు తొలగిపోతాయని భావిస్తారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాసం, జకాత్, ఫిత్రా, తర్వావీలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం సతామీకి ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉపవాస దీక్ష ఎందుకంటే..

రంజాన్ నెలలో సన్మార్గంలో నడుస్తూ పరిశుద్ధమైన జీవనం సాగించాలన్నదే ఇస్లాం మత ముఖ్య ఉద్దేశం. అలాంటి మాసంలో సూర్యోదయం ముందు నుంచీ సూర్యాస్తమయం వరకు ఆధ్యాత్మిక చింతనతో ఘన, ద్రవ, పదార్థాలు తీసుకోకుండా ఉంటారు. తద్వారా ఆకలి బాధ తెలుస్తుంది. అకలితో అలమటించే పేదవాడి బాధను తెలుసుకుని, వారికి సాయం చేయాలన్న దృక్పథం ఏర్పడుతుందని ముస్లింల నమ్మకం. అలాంటి విశ్వాసంతో భగవంతుడిపై నమ్మకం ఉంచి, నమాజ్ చేయాల్సి ఉందనీ, అది ఆధ్యాత్మిక జీవనం సాగించేందుకు దోహదపడుతుందని కఠోర ఉపవాసం చేస్తారు.

జకాత్..

ఇస్లాం ఐదు మూలస్తంభాల్లో నాలుగోది జకాత్. దీని అర్థం తన ఆదాయంలో కొంత భాగాన్ని అవసరమనుకున్న పేదవారికి పంచిగానీ, సాయంచేసిగానీ సంపదను ధార్మికం చేసుకోవడం. ప్రతి ముస్లిం తన సాంవత్సరిక ఆదాయం, ధనంలో 2.5 శాతం అల్లాహ్ మార్గంలో అవసరమున్న వారికి, పేదవారికి దానం చేయాలి. ఈ ధార్మిక విధానాన్ని జకాత్ అంటారు. ఇది మోక్షమార్గదారుల్లో ఒకటిగా చెప్పుకుంటారు.

ఫిత్రా..

ఈ పదానికి అర్థం మానవునిలో గల ప్రాకృతిక ధర్మం తనతోపాటు ఇతరులకు సంతోషాన్ని ఇవ్వడం. ఆ ప్రాకృతిక ధర్మం ప్రతి మనిషిలో ఉంటుందనీ, దీని ప్రకారం మానవుడిని దైవమార్గాన, భాగ్యం కల్పించడం, ప్రముఖంగా ఈ ఫిత్రాను రంజాన్ పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనల ముందే పేదలు, అభాగ్యులకు ఇచ్చేదానం, ప్రతి ముస్లిం కనీసం ఇవ్వవలిసిన దానం. ఇది పండుగకు ముందురోజునే ఇవ్వాలి. ఎందుకంటే పేదవారు కూడా పండుగ ఆనందంగా చేసుకోవడానికి అది ఉపయోగపడాలి. ఇది కుటుంబంలోని ప్రతి సభ్యుడు తప్పక ఇవ్వాల్సిన ధర్మం. దేవుడి పట్ల కృతజ్ఞతగా ఇవ్వాలి.

తర్వావీ ఖురాన్ పఠనం

రంజాన్ మాసం ప్రారంభమైన మొదటి రోజు నుంచీ ప్రతిఒక్కరూ రాత్రి ప్రత్యేక ప్రార్థనలతోపాటు దివ్య ఖురాన్ పఠనం చేయాలి. అంతేగాక ఎతిఖాఫ్ పాటించాలి. అంటే లైలతుల్ ఖద్ర్ నాటి నుంచి పూర్తిగా కుటుంబానికి దూరంగా మసీదులోనే ఉంటూ ఆధ్యాత్మిక చింతనలోనే పండుగ రోజు వరకు గడపాలి. తద్వారా అంతులేని పుణ్యఫలాలు లభిస్తాయనీ, తను నివసిస్తున్న గ్రామం, పట్టణం సుభిక్షంగా ఉంటుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

ఇంటి నుంచే ఉపాధి

- సర్వే చేపట్టిన ప్రభుత్వం
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు



సర్వేలో భాగంగా వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ధర్మవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపాధి అవకాశాల పెంపు పట్ల రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇంటి వద్ద నుంచే ఆదాయం పొందేలా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు 15 రోజులుగా జిల్లాలో ఇంటింటికి వర్క్‌ఫ్రం హోమ్ సర్వే చేపడుతున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా సచివాలయ సిబ్బంది వారి పరిధిలో గల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వారిని ఈ సర్వేలోకి తీసుకుంటున్నారు. ఇంట్లో కుటుంబసభ్యులు ఎంతమంది ఉన్నారు. వారిలో చదువుతున్న వారు ఎంతమంది, విద్యార్హతలు, ఏమిటి అనే వివరాలు సేకరి స్తున్నారు. ఇంజనీరింగ్ చదివితే ఉద్యోగం చేస్తున్నారా? ఏ రంగానికి చెందిన వారు సాఫ్ట్‌వేర్‌కు అయితే ఇంటి వద్ద నుంచి పని చేసుకునే ఆసక్తి ఉందా లేదా అనే అంశాలు పరిగణలోకి తీసుకుంటున్నారు. చేతి వృత్తుల్లో అయితే వడ్రంగి, కరెంటు, తాపీమేస్త్రీ, కుట్టుమిషన్, రజకులు, దర్జీ పనులు, కంప్యూటర్లు, టీవీలు, సెల్‌ఫోన్ రిపేరీ చేసేవారు, బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుని ఖాళీగా ఉన్నవారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుత సర్వే ప్రకారం కొత్తగా వివాహమై అత్తారింటికి లేదా భర్త పని చేసే ప్రాంతానికి వచ్చి ఖాళీగా ఉన్నవారికి వర్క్ ఫ్రం హోమ్ ఎంతో ఉపయోగపడుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు రద్దవుతాయేమోనని, పింఛన్లు ఆగిపోతాయేమోనని చాలా మంది ఈ సర్వేలో వివరాలు చెప్పడానికి వెనుకడుగు వేస్తున్న ట్లు సమాచారం. ఏ ఒక్కరికీ ఈ సర్వే వల్ల నష్టం ఉండదని, ప్రజల వద్దకు వచ్చే సర్వే సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

పది రోజుల్లో పూర్తి

జిల్లా వ్యాప్తంగా వర్క్‌ఫ్రం హోమ్ ఇంటింటి సర్వే జరుగుతోంది. ఇప్ప టికి 70శాతం పూర్తయింది. మరో పది రోజుల్లో మొత్తం పూర్తవుతుంది. ఈ సర్వే పూర్తయితే ప్రతి ఇంటి సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తాం. వీటి ద్వారా ప్రభుత్వ పథకాలను కూడా అర్హులైన వారికి అందజేసేందుకు వీలుంటుంది. ప్రతి ఒక్కరు ఈ సర్వేకు సహకరించాలి.

- సుధాకర్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్

అంతా ఆన్‌లైన్‌లోనే జరగాలి

ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణశర్మ



మహాజన సభలో మాట్లాడుతున్న శివనారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సొసైటీల్లో కార్యకలాపాలు, లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని, మ్యాన్‌వల్‌గా చేస్తే ఒప్పుకునేది లేదని ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీ బ్యాంకు 128వ మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏప్రిల్ 1 నుంచి సొసైటీలలో కార్యకలాపాలు, లావాదేవీలు అన్ని కంప్యూటర్ ద్వారా మాత్రమే జరగాలని, ఇందుకు సంబంధించి సొసైటీల సీఈఓలు, పర్సన్ ఇన్‌చార్జిలు, సూపర్‌వైజర్లు, సంబంధిత సహకార శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. డిపాజిట్లు సేకరించాలని, వాయిదా మీరిన రుణాలపై త్వరితగతిన లీగల్ కవరేజ్ పూర్తి చేసి మొండి బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఇక నుంచి ఆన్‌లైన్ రసీదులు మాత్రమే చెల్లుబాటవుతాయన్నారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.167.5కోట్లు బడ్జెట్‌ను మహాజనసభ ఆమోదించింది. కార్యక్రమంలో రెండు జిల్లాల డీసీఓలు అరుణ కుమారి, కృష్ణానాయక్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, నాబార్డు డీడీఎం అనురాధా, అధికారులు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద చిన్నతరహా పరిశ్రమల రుణాలకు ఉమ్మడి జిల్లాలోని మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చిన్నతరహా పరిశ్ర మలను రెండు కేటగిరీలుగా విభజించి రుణాలు ఇస్తారన్నారు. తయారీ రంగానికి సంబంధించి రూ. 50 లక్షలు, సేవా రంగానికి సంబంధించి రూ. 20 లక్షలు రుణాలు ఇస్తారన్నారు. ఈ రుణాలకు సంబంధించి 15 నుంచి 40 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. అర్హులైన మైనార్టీలు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9849901138కు సంప్రదించాలన్నారు.

టీడీపీ, వైసీపీ ఘర్షణ

- ఇరు పార్టీల వారి వాహనాలు ధ్వంసం
- ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో రామగిరిలో ఉద్రిక్తత
- పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ రత్న



ఘర్షణ పడుతున్న టీడీపీ, వైసీపీ వర్గీయులు

రామగిరి/సోమందేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య బుధవారం జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఉద్రిక్తత ఏర్పడింది. రామగిరి ఎంపీపీ మీనిగ నాగమ్మ అనారోగ్యంతో ఏడాది కిందట మరణించారు. దీంతో రామగిరి ఎంపీపీ పదవికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నిక గురువారం జరగనుంది. ఈ నేపథ్యంలో వైసీపీ వర్గీయులు విప్ జరీ చేసేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో టీడీపీ వర్గీయులు కూడా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఒకరికొకరు ఎదురుపడటంతో మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. టీడీపీ వర్గీయుల వాహనం అద్దాలను వైసీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ వర్గీయులు కూడా వైసీపీ వాహనాలను ధ్వంసం చేశారు. విప్ జారీ చేసేందుకు వచ్చిన హరినాథ్‌రెడ్డి, రాప్తాడు జడ్పీటీసీ రామాంజనేయులు, లీగల్ సెల్ నాగిరెడ్డిలపై దాడి చేశారు. వారు కూడా టీడీపీ వర్గీయులపై దాడిచేశారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్, రామగిరి, ధర్మవరం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి ఎస్ఐలు రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఘర్షణకు పాల్పడిన వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో తమపైకి దాడికి వచ్చారంటూ టీడీపీ వర్గీయులు ఆందోళనకు దిగారు. పోలీసులు వారికి నచ్చజెప్పి, నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎస్పీ రత్న రామగిరికి చేరుకుని సంఘటనపై ఆరాతీశారు. ఎంపీపీ ఎన్నిక సజావుగా సాగేలా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సంఘటనలపై ఇరువర్గాల ఫిర్యాదులు తీసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎన్నికల బందోబస్తు, నిర్వహణపై సమీక్షించారు. పేరూరు-2 ఎంపీటీసీ భారతిని బలవంతంగా వైసీపీ నాయకులు తీసుకెళ్లారంటూ వారి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీ కొత్తపల్లికి చెందిన గంగయ్య, గంగరత్నమ్మ ఫిర్యాదులు చేసినట్టు పోలీసుల తెలిపారు.



వైసీపీ వర్గీయుల వాహనంలో కొడవలి

ఎంపీపీ ఎన్నిక... భారీ బందోబస్తు

ఎంపీపీ ఉప ఎన్నిక గురువారం జరగనుంది. ఈనేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రత రామగిరిలోనే ఉండి బందోబస్తు పర్యవేక్షించారు. డీఎస్పీ హేమంత్‌కుమార్‌తోపాటు ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 35 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 100 మంది కానిస్టేబుళ్లు, 40 మంది హోంగార్డులు, రెండు ప్లటూన్స్ బలగాలను దించారు.



తోపుదుర్తిని అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

తోపుదుర్తి అరెస్టు.. విడుదల..

రామగిరిలో ఘర్షణ గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి తన అనుచరులతో బెంగళూరు నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో ఆయనను పోలీసులు సోమందేపల్లి వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై అడ్డుకున్నారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పెనుకొండ, గోరంట్ల సీఐలు రాఘవన్, శేఖర్ సిబ్బందితో ప్రకాశ్ రెడ్డి వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం ఆయనను, అనుచరులను సోమందేపల్లి స్టేషన్‌కు తరలించారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, పార్టీ కార్యకర్తలతో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ప్రకాశ్ రెడ్డిని ఎందుకు స్టేషన్‌కు తీసుకొచ్చారని పోలీసులను ప్రశ్నించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని డీఎస్పీ వివరించారు. పోలీసులు ప్రకాశ్ రెడ్డిని రెండు గంటలపాటు విచారించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసుల సూచన మేరకు ఆయన బెంగళూరుకు తిరిగి వెళ్లిపోయారు.

ప్రశాంత గ్రామాల్లో చిచ్చుకు యత్నం: పరిటాల సునీత



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చిచ్చుపెట్టాలని చూస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరిలో బుధవారం మధ్యాహ్నం జరిగిన సంఘటనపై ఆమె విలేకరుల సమావేశంలో తీవ్రంగా స్పందించారు. ఎంపీపీ ఎన్నిక విషయంలో మా సభ్యుల బలంలేదని అలాంటప్పుడు ఇందులో మా జోక్యం ఎందుకు ఉంటుందని ఆమె ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వచ్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలను వైసీపీ వారు రెచ్చగొట్టారన్నారు. పథకం ప్రకారమే వాహనాల్లో మారణాయుధాలు తెచ్చారని ఆమె ఆరోపించారు. మొన్నటిరోజు మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం చేయించారని, ఇటీవల గ్రామాల్లో మళ్లీ ఫ్యాక్షన్ కక్షలు రేపుతున్నారని ప్రకాశ్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

తెలంగాణ వాదనతో సీమకు నష్టం

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జ దశరథరామిరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న వాదనతో కృష్ణా జలాల్లో సీమకు నష్టం జరిగే ప్రమాదముందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జలాలను కోస్తా ప్రాంతానికి తరలించి అక్కడ ఆదా అయిన నీటిని శ్రీశైలంలో నిల్వ చేసి, వాటిని రాయలసీమకు మళ్లించడమే సరైన మార్గమని అన్నారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జలసాధన సమితి ఆధ్వర్యంలో 'రాయలసీమ నీటి ప్రాజెక్టులు-వెనుకబాటుతనం' అనే అంశంపై బుధవారం సమావేశం నిర్వహించారు.

జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బొజ్జ దశరథరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించి రాయలసీమకు నీళ్లుఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. ఇందులో రెండు సమస్యలు ఇమిడి ఉన్నాయన్నారు. మొదటిది ఎక్కువ ఖర్చుతో కూడుకున్న అంశమన్నారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు తరలించేందుకు సుమారు రూ.38 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారన్నారు. అయితే ఈ మొత్తాన్ని రాయల సీమలోని పెండింగ్ ప్రాజెక్టులు, కాలువ పనులు పూర్తి చేయడానికి ఉపయోగిస్తే 15 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వచ్చన్నారు. రెండో అంశం గోదావరి బనకచర్ల ప్రాజెక్టుల వల్ల ట్రిబ్యునల్లో అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న వాదన వల్ల కృష్ణా జలాల్లో నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. 1988 సంవత్సరం లో హంద్రీనీవా ప్రాజెక్టుకు నిర్దేశించిన విధంగా ఆరు లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడంలో డిజైన్ లోపం వల్ల ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ చేయడం వల్ల శాశ్వతంగా నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. లైనింగ్ పనులను వెంటనే రద్దు చేయాలన్నారు. హంద్రీనీవా మెయిన్ కాలువ 10 వేల క్యూసెక్కులకు వెడల్పు చేసి పిల్ల కాలువ వ్యవస్థ ద్వారా ఆరు లక్షల ఎకరాలకొత్త ఆయకట్టుకు నీరివ్వాలని కోరారు.

సమావేశంలో జల సాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, సహకార్యదర్శి ప్రకాష్, ఇఫ్ టు అధ్యక్షులు ఏసురత్నం, విద్యావంతుల వేదిక వెంకటేష్, నాయకులు రాహుల్, లక్ష్మి, వీరేంద్ర, వేమయ్య, పెద్దన్న, వీరు నారప్ప, అరుణోదయ చంద్ర, ఉమ్మడి కర్నూలు జిల్లా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు వైఎస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

అనంతపురం టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీచేస్తున్న ఎఫ్ఎన్ఓ, వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి అర్హుల ప్రొవిజనల్ జాబితాను వైద్యశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి తెలిపారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే గురువారం సాయంత్రంలోగా ఆధారాలతో తెలియజేయాలని బుధవారం ఓప్రకటనలో కోరారు.

డీఎస్సీ శిక్షణకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రేపటిలోగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం షార్ట్‌లిస్ట్ చేసిన ఫేజ్-2 ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా https://mdfc.apcfss.in వెబ్‌పోర్టల్‌లో ఉంచామన్నారు. షార్ట్‌లిస్ట్‌లో పేరు ఉన్న అభ్యర్థులు వారి ప్రాధాన్యం మేరకు శుక్రవారంలోపు అన్ని కోచింగ్ సంస్థలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు.

చీనీ టన్ను రూ.25 వేలు



అనంతపురం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.2,600, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 947 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయండి

- లోక్‌సభలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



ప్రసంగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ బుధవారం లోక్‌సభలో కోరారు. రైల్వే ఆస్పత్రుల్లో సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పారామెడికల్ సిబ్బంది నియామకం ఇదివరకు పబ్లిక్ అడ్వర్టైజ్‌మెంట్, నియామక కమిటీ ద్వారా జరిగేదన్నారు. ఇటీవల ప్రభుత్వ ఈ మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) ద్వారా మాత్రమే చేపట్టాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ విధానం వల్ల ఆస్పత్రి యాజమాన్యానికి అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాలు, అనుభవం పరిశీలించే అవకాశాన్ని తగ్గిస్తోందన్నారు. తరచూ సిబ్బంది మారడం ద్వారా ఆస్పత్రి కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీని ప్రభావం రోగులకు అందించే వైద్య సేవలపై పడుతోందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని గత నియామకపు విధానాన్ని పునరు ద్ధరించి, ఆస్పత్రి కమిటీ ఆధ్వర్యంలోనే మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఏపీలో నాలుగు ప్రధాన రైల్వే డివిజన్లు విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు ఉన్నప్ప టికీ సొంత రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు లేదన్నారు. దీని కారణంగా ఉద్యోగ ఖాళీలు భర్తీకావడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఏపీకి ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి, రైల్వే ఉద్యోగాల భర్తీపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని కోరారు.

మెడికల్ షాపులో విస్తృత తనిఖీ



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్

రాయదుర్గంటౌన్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. టానెక్స్ అనే మత్తు టానిక్ పెద్ద ఎత్తున అమ్ముతున్నారన్న సమాచారం రావడంతో స్థానికంగా ఉన్న ఓ మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. ఈ నెల 14న టానెక్స్ మత్తు టానిక్‌ను బళ్లారిలో అమ్మడంతో చిత్రదుర్గం పోలీసులు హనుమరెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాయదుర్గంలో హనుమరెడ్డికి చెందిన మెడికల్‌స్టోర్‌ను తనిఖీ చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మందులు అమ్ముతున్నట్లు తనిఖీల్లో తేలింది. స్థానిక వీఆర్వో, ఇద్దరు పోలీసుకానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. వెయ్యికి పైగా ఈకాప్ సిరప్‌లు దొరికాయి. వాటిని సీజ్ చేశారు.

కాలి పిక్క నుంచి గాలం తీసిన 108 సిబ్బంది

గార్లదిన్నె, మార్చి 26(ఆంధ్రజ్యోతి): యువకుడి కాలిపిక్కలో గుచ్చుకున్న చేపల గాలాన్ని 108 సిబ్బంది బుధవారం చాకచక్యంగా తీశారు. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రసాద్ బుధవారం గ్రామ సమీపంలోని నీటి కుంటలకు చేపలు పట్టేందుకు గాలంతో వెళ్లాడు. అక్కడ పొరపాటున గాలం ప్రసాద్ కాలిపిక్కలో ఇరుక్కుంది. కుటుంబ సభ్యులు గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. వారు తీయలేక అనంతపురం వెళ్లమని 108లో పంపారు. 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) లక్ష్మీనారాయణ, పైలెట్ బాబు ఇస్మాయిల్ చాకచక్యంగా గాలాన్ని తీసి, బాధితుడిని సురక్షితంగా ఇంటికి పంపారు.

ఖాతాల్లోకి అదనపు సొమ్ము: పీడీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శైలజ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహాల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు ఆర్థిక సాయం సొమ్ము వారి ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటి వరకు చేసిన సర్వేలో4వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.5.94కోట్లు జమ చేసినట్లు హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు. ఈ అంశంపై బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనెల 19 నుంచి 23వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల సర్వే చేపట్టామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు 16389మందికి గాను 15438మంది లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి అంగీకారపత్రం సేకరించామన్నారు. గత ప్రభుత్వం చెల్లించిన మొత్తంతో పాటు బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో 6080మంది లబ్ధిదారులకు గాను రూ.9.11కోట్లు నిధులు మంజూరు చేసినట్లు పీడీ వెల్లడించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుత్తి మండ లం గొల్లలదొడ్డి (సేవాఘడ్)లో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఏప్రిల్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ఎస్టీ బ్యాక్ లాగ్ కింద 6వ తరగతిలో 49 సీట్లు, 7వ తరగతిలో 30, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 06 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ఈ సీట్ల భర్తీలో ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, ఏఈక్యూ(ఏజెన్సీ ఎంప్లాయ్ కోటా)లకు 3శాతం చొప్పున సీట్లు కేటాయిస్తామన్నారు. http://twreiscet.apcfss.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న గొల్లలదొడ్డి గిరిజనపాఠశాలలో రాత పరీక్ష నిర్వహించే మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను 9885369079, 8978239363, 9550655840 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతపురం విద్య, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) అనంతపురం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం ఉపాధ్యాయభవన్‌లో జిల్లా చైర్మన్ సిరాజుద్దీన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ హృదయ రాజు ఎన్నికల పరిశీలకులుగా హాజరు కాగా... .కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన చైర్మన్‌గా శ్రీనివాసనాయక్, ప్రధానకార్యదర్శిగా పురుషోత్తం, కో చైర్మన్లుగా ఓబులేసు, లింగమూర్తి, ఉప ప్రధాన కార్యదర్శిగా గోవిందరాజులు, రమణారెడ్డి, వెంకటేషు, కార్యదర్శిగా వెంకటరత్నం, కోశాధికారిగా రెహమాన్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరెడ్డి, మంజుల, సిరాజుద్దీన్, రామాంజినేయులు, శివశంకర్, లింగమయ్య, గోపాల్‌రెడ్డి, జయరాంరెడ్డి, కరీముల్లా, మల్లికార్జునను ఎన్నుకున్నారు.

గంజాయి విక్రేతకు పదేళ్ల జైలు

గుంతకల్లు/అనంతపురం క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గంజాయిని ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలిస్తూ గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టుబడిన వ్యక్తికి అనంతపురం ఏడీజే సత్యవాణి 10 సంవత్సరాల జైలు, రూ. లక్ష జరిమానా విధించారు. ఒడిశా రాష్ట్రం కోడెల గ్రామా నికి చెందిన భగవాన్ పోలై 2023 డిసెంబరు 18న గంజాయిని తరలిస్తూ గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డాడని జీఆర్పీ పోలీ సులు తెలిపారు. ఒడిశా నుంచి 32 కేజీల గంజాయిని గుజరాత్‌కు తరలించడానికి వచ్చిన నిందితుడు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో రైలు మారడానికి దిగాడన్నారు. రైలు కోసం వెయిటింగ్ హాల్‌లో వేచి ఉండగా, సాధారణ తనిఖీల్లో భాగంగా బ్యాగులోని సమాన్లను తీసి చూడగా అందులో గంజాయి కనిపించిందన్నారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న ఏఈ ఓబులేశు నుంచి ఫిర్యాదు తీసుకున్న అప్పటి జీఆర్పీ సీఐ నగేశ్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తును పూర్తిచేసి అనంతపురం ఏడీజే కోర్టుకు చార్జ్‌షీట్‌ను దాఖలుచేశారు. కేసులో నలుగురు సాక్షులను విచారించిన ఏడీజే సత్యవాణి ఆరోపణ రుజువు కావడంతో బుధవారం తీర్పును వెలువరించారని జీఆర్పీ పోలీసులు తెలిపారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఈశ్వరమ్మ వాదించారని పేర్కొన్నారు.

బడి పిలుస్తోందికి జాతీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న తరిమెల రాజు

అనంతపురం కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనంత పురం వాసులు నిర్మించిన లఘుచిత్రానికి జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి దక్కింది. నగరానికి చెందిన తరిమెల రాజు దర్శకత్వంలో నిర్మాత కేపీ రాజు, డీఓపీ పవన్ లింగాల బడి పిలుస్తోంది లఘుచిత్రాన్ని నిర్మించారు. ఢిల్లీకి చెందిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌లో బడి పిలుస్తోంది లఘుచిత్రాన్ని ద్వితీయ బహుమతికి ఎంపిక చేసింది. ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్‌సి మానవ అధికార భవన్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ సభలో తరిమెల రాజుకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇండియా చైర్మన్, జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం చేతులమీదుగా బహుమతితోపాటు రూ.1.5 లక్షలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ విభాగానికి చెందిన జోగేంద్రసింగ్, భరత్‌లాల్, విజయభారతి సయాని, ప్రసాద్ మీనా, లఘుచిత్ర కళాకారులు సాకే సుధాకర్, శంకర్‌రెడ్డి, శ్రీపాద పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఏప్రిల్ 6 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించ నున్న శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్లను బుధవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్ మాట్లాడుతూ... ఉత్సవాలకు భక్తులు విరివిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కిశోర్, టీడీపీ నాయకుడు సుందర్, గంగారామ్, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ చౌదరి, వెంకటరమణ, ఎర్రిస్వామి, రాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కనగానపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా బాలిక విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ మెదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసు కోవాలని ప్రిన్సిపాల్ నరసమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40సీట్లు, ఇంటర్ ఎంపీసీ గ్రూపులో చే రేందుకు ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కనగానపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పదోతరగతి పరీక్షలను డీఈఓ కిష్టప్ప బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ప్రిన్సిపాల్ స్పర్శ, సిబ్బందికి సూచించారు.

వ్యవసాయ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం

అనంతపురం అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం బుధవారం ఉండవల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

'విద్యుత్ షాకులు' బుక్‌లెట్ విడుదల

అనంతపురం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాప్తాడు రూరల్ ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో 'జగన్ సర్కారు పోయి- బాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ షాకులు' అనే బుక్‌లెట్‌ను విడుదల చేశారు. మండలంలోని కందుకూరులో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్ర శేఖర్‌రెడ్డి, ప్రాంతీయ కార్యదర్శి రామాంజినేయులు తదితరులు బుధవారం బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతలయ్య, రాయమ్మ, నారాయాణమ్మ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు


ముస్లింలకు వడ్డిస్తున్న రాజారావు

అనంతపురం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాంనగర్ అరాఫత్ మసీదులో 35, 36వ డివిజన్లకు చెందిన ముస్లింలకు బుధవారం మాజీ కార్పొరేటర్ రాజారావు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముందుగా రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ భోజనం వడ్డించారు.

ప్రతిభకు చిరునామా ఆర్ట్స్ కళాశాల: ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉన్నత విదారంగంలో విద్యార్థుల ప్రతిభకు చిరునామా ఆర్ట్స్ కళాశాల అని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ పేర్కొన్నారు. బుధవారం బీబీఏ విద్యార్థులకు బ్లేజర్‌ను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ, పీజీ సైన్స్, ఆర్ట్స్ కోర్సుల్లో దాదాపు మూడు వేలమంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ఆర్ట్స్ కళాశాల డిగ్రీ పట్టాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

ఐటీఐలో సోలార్ టెక్నీషియన్ సిలబస్

అనంతపురం సెంట్రల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఐటీఐ ట్రేడ్ కోర్సుల్లో సోలార్ టెక్నీషియన్ పాఠ్యాంశాలను అనుసంధానం చేయనున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి పేర్కొన్నారు. బుధవారం జిట్ ఒకేషనల్ అడ్వైజర్ సుప్రియా మండోలా, లేబర్ మార్కెటింగ్ అడ్వైజర్ తాన్యా కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ మాట్లాడు తూ సోలార్ ఉత్పత్తి, వినియోగ ప్రక్రియలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. బాలికల కళాశాల ప్రిన్సిపాల్ నందకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలిపోయిన పండ్లతోటల రైతులను ఆదుకోవాలి


గార్లదిన్నె, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాలిపోయిన పండ్లతోటల రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు శ్రీనాథ్‌చౌదరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొట్టాలపల్లికి చెందిన నెప్పల్లి రమేష్ అనే రైతుకు చెందిన రెండెకరాల్లోని చీనీచెట్లు మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయాయి. వాటిని బుధవారం సీపీఐ నాయకుడు శ్రీనాథ్‌చౌదరి పరిశీలించారు.

ఏడీసీసీ మాజీ చైర్మన్ కోనారెడ్డికి సతీ వియోగం


సులోచనమ్మ (ఫైల్)

శింగనమల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ మాజీ చెర్మన్ తరిమెల కోనారెడ్డి సతీమణి సులోచనమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన కోనారెడ్డి కాంగ్రెస్ హయాంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా కొనసాగారు. ఆయన సతీమణి సులోచనమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారు. బుధవారం అమె మృతి చెందారు. గురువారం తరిమెలలో అంత్యక్రియలు నిర్వహి స్తున్నట్లు కటుంబసభ్యులు తెలిపారు.

పంచాయతీ బోరు, పైపులైన్ ధ్వంసం


బోరు, పైపులైన్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

నార్పల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులసల నూతల గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరు, పైపలైను, స్టార్టర్లను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కొద్దిరోజుల క్రితం గ్రామంలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. స్పందించిన పాలకవర్గం, అధికారులు గ్రామంలోని కుంటలో పంచాయతీ ఆధ్వర్యంలో నూతన బోరు వేసి పైప్‌లైన్‌తో పాటు స్టార్టర్లను ఏర్పాటు చేశారు. వాటిని ధ్వంసం చేయడం దారుణ మని ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి శ్యామల నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్థులను ఇబ్బందులకు గురి చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

నెరవేరిన గ్రామస్థుల కల


పూర్తయిన ఎంబీ పల్లికి వెళ్లే రోడ్డు

- ఎంబీ పల్లి రోడ్డు నిర్మాణం పూర్తి
- త్వరలో ప్రారంభం... స్థానికుల్లో ఆనందం

అనంతపురం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామానికి తారు రోడ్డు అనేది గ్రామస్థుల ఏళ్లనాటి కల. గ్రామ ఏర్పాటై దాదాపు నాలుగు తరాలు దాటింది. అయినా ఆ గ్రామానికి వెళ్లాలంటే నిత్యం ఒడిదుడుకుల ప్రయాణమే. మట్టిరోడ్డులోని అడుగడుగునా గుంతల్లో గ్రామస్థులు నిత్యం అవస్థల ప్రయాణం సాగించేవారు. 2018లో గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైంది. నిధులు విడుదలయ్యాయి. పనులు ప్రారంభించారు. ఇంతలోనే ఎన్నికలు వచ్చాయి. గ్రామస్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధులు రోడ్డును పూర్తిగా విస్మరించారు. ఐదేళ్ల కాలంలో గంపెడు మట్టి వేసిన పాపన పోలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారింది. స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే నెల రోజుల కిందట మండలంలోని ఆలమూరు పంచాయతీ ఎంబీ పల్లి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల రోడ్డు నిర్మాణం పూర్తయింది. తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఇక గ్రామస్థులు రయ్..రయ్ అంటూ రాక పోకలు సాగిస్తున్నారు. త్వరలోనే ఎమ్మెల్యే పరిటాల సునీత రోడ్డును ప్రారంభించనున్నారు.

ఫలించిన గ్రామస్థుల ఆశలు

గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించడంతో గ్రామస్థులు సంతోషించారు. అయితే ఎన్నికలు వచ్చి వైసీపీ అధికారంలోకి రావడంతో గ్రామస్థుల అవస్థలు మళ్లీ మెదటి కొచ్చాయి. వైసీపీ ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణం పూర్తి అటెక్కించేశారు. తిరిగి రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే గ్రామస్థులకు ఇచ్చిన హామీమేరకు రోడ్డు నిర్మాణం తిరిగి ప్రారంభించారు. రూ.2.5 కోట్లతో గ్రామ సమీపంలో కొంత సీసీ రోడ్డు, మిగిలినది బీటీ రోడ్డు వేశారు. దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మించారు. దీంతో తమ కొన్నేళ్ల ఆశ ఫలించిందని ఎంబీపల్లి గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు సమస్య తీరింది



గ్రామానికి వెళ్లాంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కొన్నేళ్లుగా రోడ్డు కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికి నెరవేరింది. 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామానికి రోడ్డు మంజూరైంది. అయితే ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వారు రోడ్డు గురించి పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో రోడ్డు పూర్తి అయింది. రోడ్డు సమస్య తీరినట్లయింది.

- వీరాంజనేయులు, ఎంబీ పల్లి

సంతోషంగా ఉంది



కొన్నేళ్లుగా గ్రామానికి రోడ్డు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడేవాళ్ల. గ్రామంలో నుంచి అనంతపురం- యాలేరు ప్రధాన రోడ్డుకు చేరుకునేందుకు అరగంట పట్టేది. ఇటీవల రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. ఇప్పుడు పది నిమిషాల్లో నగరానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు చేరుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది.

- మాదినేని ఉమాశంకర్, ఎంబీ పల్లి

కమిటీలు వేసి భూసమస్యలు పరిష్కరిస్తాం

- ప్రజాదర్బారులో ఎమ్మెల్యే పరిటాల సునీత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో భూ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయని, అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటుచేసి వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం టీడీపీ నాయకులతో సమీక్ష నిర్వహించి గ్రామసమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూసమస్యల్లో ఎక్కువగా అన్నదమ్ముల పాసు పుస్తకాలు, సరిహద్దు వివాదాలే ఉన్నాయన్నారు. వాటిని గ్రామ పె ద్దల సమక్షంలో పరిష్కరించుకుంటే మంచిదని సూచించారు. గత ప్రభు త్వంలో కక్ష కట్టి పలువురి రేషన్ కార్డులు తొలగించారని, వాటిని త్వరలో మంజూరు చేస్తామన్నారు. పింఛన్‌ల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందన్నారు. ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాతో పాటు ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఇటీవల పార్టీ అధిష్ఠానం తీసుకొచ్చిన కుటుంబ సాధికారత సర్వే కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కేఎస్ఎస్ కార్యక్రమం తరువాత అన్ని కమిటీలను ఏర్పాటుచేస్తామన్నారు.

డుమ్మా డాక్టర్లకు మెమోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వజనాస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి హాజరై, ఆయా విభాగాలలో పక్కాగా విధులు నిర్వహిస్తూ కనిపించారు. 'డుమ్మా డాక్టర్లు' అనే శీర్షికతో ఆంధ్ర జ్యోతిలో ప్రచురించిన కథనం తీవ్ర చర్చకు దారి తీసింది. ఆ డుమ్మా డాక్టర్ల తీరుపై పలువురు రోగులు మండిపడడం కనిపించింది.

ఇద్దరికి మెమోలు: డుమ్మా డాక్టర్ల కథనంపై డీఎంఈ ఆరా తీశారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు విచారణ చేయించారు. విచారణ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు ఆ ఇద్దరు ఆర్థోడాక్టర్లకు మెమోలు ఇచ్చినట్లు సూపరింటెండెంట్ అధికారికంగా వెల్లడించారు. ఆస్పత్రిలో సమయపాలన పాటించని డాక్టర్లపై చర్యలు తీసుకునేందుకు డీఎంఈ సిద్ధమయ్యారు. ఆస్పత్రిలో డ్యూటీలకు డుమ్మాకొడుతూ పేదరోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్ల సమాచారాన్ని పంపించాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. అటువంటి డాక్టర్లపై డీఎంఈకి ఫిర్యాదు పంపుతున్నట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్య రానీయకండి : ఎమ్మెల్యే

రామగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. మండలంలోని వెంకటాపురంలో ఉన్న క్యాంప్ కార్యాలయంలో ఆమె బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈ, ఏఈలు ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. అలాగే ముదిగుబ్బ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారంపై పరిటాలశ్రీరామ్ చర్చించారు. మరోవైపు పెండింగ్‌లో ఉన్న తాగునీటి పథకాల గురించి ఎమ్మెల్యే సమీక్షించారు. జలజీవన్ పథకం ద్వారా పీఏబీఆర్ నుంచి నియోజకవర్గంలో మొత్తం రూ.407 కోట్లతో పనులు .జరుగుతున్నాయన్నారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా తాగునీరు ఇవ్వాలనే పథకం రూపొందించినట్టు వివరించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి సీకేపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాలకు తాగునీరందిస్తామని పరిటాలసునీత తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామగిరి మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం వెంకటాపురంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. ఏడుగురికి రూ.10.88లక్షల చెక్కులను పంపిణీచేశారు. ప్రభుత్వం బాధితులను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అనంత డిపోను సందర్శించిన జోనల్ చైర్మన్


బస్టాండు ఆవరణలో సందర్శిస్తున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు బుధవారం సాయంత్రం అనంతపురం డిపోను సందర్శించారు. బస్టాండు ఆవరణ లో జరుగుతున్న కొత్త రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే సిబ్బందిని అడిగి సమస్యలపై ఆరా తీశారు. బస్టాండు ఆవరణలో అపరిశుభ్రత లేకుండా చూడాలని, అలాగే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డీఎంకు సూచించారు. కార్యక్రమంలో డీఎం నాగభూపాల్, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేంద్ర, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బస్టాండు మేనేజర్ కేఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ పార్క్‌ను పరిశీలించిన కమిషనర్

అనంతపురం క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్ బాలస్వామి బుధవారం రెండో రోడ్డులోని స్టడీ పార్క్‌ను పరిశీలించారు. స్టడీ పార్కులో నీటి సదుపాయం లేకపోవడం గమనించి, నీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పార్క్ ఎంట్రన్స్ గేటు మరమ్మతు పనులను, ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. విద్యార్థులు వస్తుంటారని పార్కును పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం కమలానగర్‌లో చెత్తకుప్పలను తొలగించక పోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌ను పిలిపించి శుభ్రం చేయించాలని సూచించారు. డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు చెప్పారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంస్కర్తల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

- ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతులైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, భారత తొలి దళిత ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ, బాబూజీ ఆదర్శ సేవా సంఘం కమిటీ సభ్యులు బుధవారం డీడీని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. దేశం గర్వించదగ్గ సంస్కర్తలైన అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ జన్మించిన ఏప్రిల్ నెలను సంస్కర్తల మాసంగా పరిగణించి వారి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ కులసంఘాలు, అన్ని సామాజిక వర్గాల సహకారంతో ఘనంగా నిర్వహించుకుందామని డీడీ పిలుపునిచ్చారు

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందుంటుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచనల మేరకు బుధవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్యచౌదరి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ నాయకులు సుందర్, రజక, నాయీబ్రాహ్మణ, వాల్మీకి కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పరమేశ్వరన్, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి, కార్పొరేటర్ బాలాంజినేయులు తదితరులు ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సైపుద్దీన్, ముక్తియార్, వన్నూరప్ప, నెట్టెం బాలకృష్ణ, చరిత, జేఎం బాషా, ఇస్మాయిల్, కృష్ణం రఘు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజన ఆపాలి: సీపీఐ


మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కేంద్రం వెంటనే దేశవ్యాప్తంగా చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను నిలిపివేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో దక్షణాదిలో 29 ఎంపీ సీట్లు పెరిగితే, ఉత్తరాదిలో 129 సీట్లు పెరుగుతాయన్నారు. ఈ క్రమంలో దక్షణాది రాష్ట్రాలకు చాలా నష్టం జరుగుతుందన్నారు. ఫలితంగా చట్టాల రూపకల్పనలో పార్లమెంటులో దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షణాదిపై ప్రధాని మోదీకి ఎందుకు కక్ష అని ప్రశ్నించారు. ఈ ప్రక్రియను 25 ఏళ్ల పాటు ఆపకపోతే... దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఇతర నేతలు సంజీవప్ప,శ్రీరాములు, రామకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, గోవిందు, లింగమయ్య, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు సీఐ కరుణాకర్



బుక్కరాయసముద్రం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెం దిన టీడీపీ కార్యకర్త రామన్నను పోలీసులు కొట్టిన ఘటనలో సీఐ కరుణాకర్ ను వీఆర్‌కు పంపుతూ బుధవారం అ నంతపురం రేంజ్ డీఐజీ షిముషి ఆదేశాలు జారీ చేశారు. డబ్బుల విషయంలో మంగళవారం రాత్రి పెద్దమనిషిగా వెళ్లిన మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యుడు, టీడీపీ కార్యకర్త రామన్నను సీఐ కరుణాకర్ కొట్టారని టీడీపీ కార్యకర్తలు, నేతలు స్థానిక స్టేషన్ ఎదుట ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఎస్పీ జగదీష్ విచారణ చేసి డీఐజీ షిముషికి నివేదిక ఇచ్చారు. దీంతో సీఐ కరణాకర్‌ను తిరు పతి ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ, వీఆర్‌కు బదలీ చేస్తూ ఉత్తర్వులు డీఐజీ జారీ చేశారు. వీటితో పాటు.. గతంలో టీడీపీ కార్యక ర్తలపై అక్రమ కేసులు బనాయించిన సీఐ కరుణాకర్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, ముంటి మడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు ఇటీవలే అనంతపురం పర్యటనకు వచ్చిన హోం మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత కూడా సీఐ టీడీపీ కార్యకర్తలను కొట్టడం, అక్రమ కేసులు బనాయిస్తుండడంతో అధికార పార్టీకి చెందిన నాయకులు ధర్నాకు దిగారు. ఈ ఘటనను నియోజకవర్గం నాయకులు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత సీఐపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసులకు సూచించినట్లు సమాచారం.

హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్...

బుక్కరాయసముద్రంలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ జగదీష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ కార్యకర్తను కొట్టిన ఘటనతో పాటు ఇటీవలే సరైన విచారణ చేయకుండా పలువురు టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అలాగే చనిపోయిన వ్యక్తిపై ఒక ఎఫ్ఐఆర్‌లో కేసు నమోదు చేశారని, అవినీతి ఆరోపణలు వచ్చాయని వీఆర్‌కు పంపినట్లు తెలిసింది.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- టీడీపీ శింగనమల నియోజకవర్గ నాయకులు


గాయపడిన కార్యకర్తను పరామర్శిస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం, మార్చి26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా, వారికి పార్టీతో పాటు తాము అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా నేత ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి బుక్కరాయసముద్రం పోలీసులు కొట్ట డంతో గాయపడిన కార్యకర్త రామన్నను బుధవారం ఆ పార్టీ నియోజకవర్గం నాయకులు ఆలం, కేశవరెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు పరామర్శించారు. జరిగిన సంఘటనపై బాధితుడితో మాట్లాడి తెలుసుకున్నారు. టీడీపీ కార్యకర్తలపై సీఐ కరుణాకర్ బనాయించిన అక్రమ కేసులపై అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ హర్షకు వివరించారు. టీడీపీ మండల కన్వీనర్ అశోక్‌కుమార్, నాయకులు కేశన్న, ఎస్ నారాయరణస్వామి, లక్ష్మీనారా యణ, సీ నారాయణ స్వామి, పటేల్‌భూషి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తి వేయాలని ఎస్పీకి వినతి

బుక్కరాయసముద్రం మండలంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని పార్టీ నియోజకవర్గం నాయకులు ఎస్పీ జగదీష్‌కు విన్నవించారు. టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు, అశోక్, ఎస్ నారాయణస్వామి బుధవారం నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌ను కలిసి అక్రమ కేసులపై వివరించారు. వాటిపై పూర్తి దర్యాప్తు చేపట్టాలని రూరల్ డీఎస్పీ వెంటేశ్వర్లును ఎస్పీ ఆదేశించినట్లు వారు తెలిపారు. అలాగే ఓ వైసీపీ మహిళా కార్యకర్తపై దాడి చేసినట్లు ఐదేళ్ల క్రితం చనిపోయిన టీడీపీ కార్యకర్త శివయ్యపై ఇటీవల కేసు నమోదు చేశా రని వివరించినట్లు తెలిపారు. ఈ కేసులపై పూర్తి విచారణ చేసి, తగు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని టీడీపీ నాయకులు తెలిపారు.

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ


ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గౌస్‌మొద్దీన్

అనంతపురం అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేద ముస్లిం మహిళలకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ చీరలు పంపిణీ చేశారు. స్థానిక సాయినగర్‌లోని తన నివాసం వద్ద ఆయన బుధవారం 500 మందికి ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. జకాత్‌ను అనుసరించి ప్రతి ఏడాది రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు డిష్ ప్రకాష్, బాబాపకృద్దీన్, రఫీ, గో పాల్, లక్ష్మీనారాయణ, మహేష్, నందమూరి అభిమానులు జాఫర్, సుధాకర్, బాబు, రామకృష్ణ, హరీష్‌రెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు సూపర్‌కప్ ఫుట్‌బాల్ ఫైనల్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సూపర్‌కప్ ఫుట్‌బాల్ పోటీల్లో ఫైనల్స్ గురువారం జరగనున్నాయి. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఏపీ సూపర్ కప్ పోటీలు ఆరోరోజు బుధవారం కొనసాగాయి. లీగ్ పోటీల్లో ముందంజలో ఉన్న కొల్లేరు 18పాయింట్లు, గోదావరి 15పాయింట్లు సాధించి ఫైనల్‌కు చేరాయి. గురువారం ఉదయం ఫైనల్ పోటీలు జరగనున్నాయి. జిల్లా ఫుట్‌బాల్ అసోసి యేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సరిపూటి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకేకే విద్యార్థుల పరిశోధనాత్మక యాత్ర


విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో విద్యార్థులు

అనంతపురం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులు పరిశోధనాత్మక యాత్ర చేపట్టారు. వారు బుధవారం విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ) తుంబాను సందర్శించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ... సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి పరిశోధనాత్మక పర్యటన ఓ విలువైన అనుభవాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పీవీకేకే ఐటీ ఈసీఈ అధ్యాపకులు ప్రవీణ్‌రాజు, రవికుమార్, రాఘవేంద్ర, అంజులత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

● ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ విప్ కాలవ


గుమ్మఘట్టలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

గుమ్మఘట్ట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన ప్రజాసమస్యలను పరిష్కరించడానికి ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ 55 ఫిర్యాదులను అందజేశారు. వాటిని పరిశీలించిన కాలవ ఈ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు సమస్యల్ని నేరుగా ఎమ్మెల్యేలకు విన్నవించడానికి సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజాసమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం ప్రతి బుధవారం ఈ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఎం గోవిందప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత, ట్రాన్స్‌కో ఏఈ బాలచంద్ర, ఏపీఓ సురేష్, ఆర్ఐ రామాంజనేయులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయాలి..

గుమ్మఘట్ట: మండలంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు కలిసిమెలిసి సమష్టిగా పనిచేయాలని అప్పుడే గ్రామాల్లో అనుకున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసుకోగలుగుతామని కాలవ శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలో ఆయన టీడీపీ కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎక్కడైనా చిన్న చిన్న మనస్పర్థలు రావడం సహజమేనని, అయితే సర్దుకుపోవాలని తెలిపారు. అప్పుడే సత్ఫలితాలు పొందవచ్చన్నారు. ప్రతి కార్యకర్తను తాను కుటుంబసభ్యుడిగా భావిస్తానని, ఏవైనా సమస్యలుంటే తనను నేరుగా కలిసి పరిష్కరించుకోవాలని చెప్పారు. నాయకుల మధ్య విభేదాలు వీడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మరి కొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, నాయకులు దానవీర, సదాశివ, రమేష్, కేపీ దొడ్డి నాగరాజు, ఉస్మాన్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరు..

కణేకల్లు: మండల కేంద్రంలోని జామియా మసీదులో జరిగిన ఇఫ్తార్‌విందులో ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ముతవల్లిలు ముర్షిద్ పీర్ ఖాద్రి, ఎంసీ శర్మాస్ ఉపవాసదీక్షలు బూనిన ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కాలవ ముఖ్యఅతిథిగా హాజరై భోజనాన్ని వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిముస్లిం ముస్లిం రంజాన్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు లాలెప్ప, షేక్‌ఫక్రుద్దీన్, ఆనంద్‌రాజ్, సుదర్శన్, బీటీ రమేష్, నరేంద్ర, నవీన్, షేక్‌ముజ్జు, చాంద్‌బాషా, మహబూబ్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

విడపనకల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలికి గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షసహాయ వ్యవసాయ సంచాలకురాలు రోజా మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలు చేయించి.. ఆ తర్వాత ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. అప్పుడు నాణ్యమైన, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం అధికారి ప్రతాప్, ఏఓ హెచ్ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, వీపీఏ రమేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి, జీ కొట్టాల, కాళాపురం గ్రామాల్లో ఏఓ లీనావసుంధర పర్యటించి రైతులకు భూ సార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఏఈఓ శ్రీనివాసరావు, ఎంపీఈఓ లక్ష్మీనారాయణ, వీహెచ్ఏ చిరంజీవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

విడపనకల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంచనహాల్ గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వీరాంజనేయులను బుధవారం సాయంత్రం ఉరవకొండ ఎక్సైజ్ సీఐ లక్ష్మీ అరెస్టు చేశారు. వీరాంజనేయులు ఎక్కడి నుంచో మద్యం బాటిళ్లు తెచ్చి విక్రయిస్తున్నాడని, ఈ విషయమై జిల్లా అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారని, జిల్లా అధికారుల ఆదేశాలతో దాడులు చేసి అతడిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు. అలాగే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అయితే వీరాంజనేయులు అరెస్టుపై కుటుంబసభ్యులు మండిపడ్డారు. ఎలా అరెస్టు చేస్తారని అధికారులను నిలదీశారు. గ్రామంలో 5 బెల్ట్ షాపులు ఉన్నాయని, మిగతా నలుగురిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూడేరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మారెన్న అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మారెన్న తలుపూరు రోడ్డు సమీపంలో తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు వెంటనే వెళ్లి అతడికి కిందకు దించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మారెన్నను ప్రైవేటు వాహనంలో చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

రెండో సెమిస్టర్ నోటిఫికేషన్ విడుదల

గుంతకల్లుటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో రెండో సెమిస్టర్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్‌ను బుధవారం కళాశాల డైరెక్టర్ గోపాల్ విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు విద్యార్థులకు అప్లికేషన్లు జారీ చేస్తామన్నారు. అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 12వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చునన్నారు. ఏప్రిల్ 23వతేదీ వరకు రూ.500లు అపరాధ రుసుముతో చెల్లించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆ తరువాత ప్రొవిజనల్ పర్మిషన్‌తో పరీక్ష రాయాలనుకుంటే మే 4వ తేదీ వరకు రూ.3వేలు అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 9న టైం టెబుల్ విడుదల చేస్తామన్నారు. ఏప్రిల్ 22 నుంచి మే 4వరకు హాల్ టికెట్ల పంపిణీ, మే 5వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం

గుత్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 40 మంది రక్తదానం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప, అఖిల భారత చిరంజీవి జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు ప్రభుత్వాస్పత్రి ఏఓను సస్పెండ్ చేయాలి

గుంతకల్లుటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ప్రభుత్వాసుపత్రి ఏఓ రాంప్రసాద్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అమరావతిలోని తాడేపల్లిలో గల రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఏఓ.. మహిళా సిబ్బందిని లైంగిక వేధింపులకు గురిచేయడంతో పాటు అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికితీసుకెళ్లడంతో రెండు సార్లు ఏఓపై విచారణ సైతం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ డాక్టర్ సిరికి వినతి పత్రం అందజేశారు. నాయకులు నారాయణ, రామదాస్, జానయ్య, సోమశేఖర్, రాము, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నదృశ్యం

ఉరవకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంపై పట్టణంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రాజు, రమేష్‌బాబు, శివ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కోసం ఉద్యమిద్దాం: ఏఐవైఎఫ్

ఉరవకొండ, మార్చి26(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, నిరుద్యోగ భృతి కోసం ఉద్యమిద్దామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని గవిమఠం ఆవరణలో బుధవారం ఆయన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి దశాబ్ద కాలం గడిచినా.. ఇంత వరకూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ఇందుకు ఉద్యమాలు చేపట్టనున్నామని, ఇందుకు సంబంధించిన మహాసభలు తిరుపతిలో మే15 నుంచి 18వతేదీ వరకూ జరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కోట్రేష్, మురళి, నాగయ్య, నవీన్, వేణు, సతీష్ పాల్గొన్నారు. అలాగే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో అనంతపురం కిమ్స్ సవీర ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 100మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. కర్నూలుకి చెందిన శ్రీనివాసులు, లవన్న కారులో గుంతకల్లుకు వచ్చారు. అక్కడ పని అనంతరం తిరిగి కర్నూలుకు వెళ్తుండగా రజాపురం గ్రామశివారులో కారు ముందర టైరు పగిలి అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయలయ్యాయి. వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలి


ములకలేడులో రైతులతో ఉమామహేశ్వరమ్మ

శెట్టూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పక నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మండలకేంద్రంతో పాటు ఐదుకల్లు, ములకలేడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్టర్ నమోదు ప్రక్రియను ఆమె ఏడీఏ వాసుకి రాణితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలు అందాలంటే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కావున రైతులందరూ ఈ నెల 29వ తేదీ లోపు ఆయా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తప్పకుండా నమోదు చేసుకోవాలని సూచించారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన: ఎమ్మెల్యే జయరాం


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని, ఆయన ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ చేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్‌ను రూపొందించారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో బుధవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్య పరిష్కారం కోరుతూ ఫిర్యాదులు అందజేశారు. వాటిని ఎమ్మెల్యే స్వీకరించి పరిశీలించారు. ఈ సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

గుంతకల్లు: నియోజకవర్గంలోని 45 మంది లబ్ధిదారులకు 41.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను పట్టణంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వని స్థాయిలో ప్రస్తుత ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్‌ను మంజూరు చేస్తోందన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ ఫండ్ మంజూరైందని చెప్పారు.

యూటీఎఫ్ సమావేశం

బొమ్మనహాళ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దేవగిరిక్రాస్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ సమావేశం జరిగింది. ఇందులో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 117 జీవోను రద్దు చేసి మరో జీవోను తేవడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మన ఊరు బడిని కాపాడుకుందామని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, రాఘవేంద్ర, ఆంజనేయులు, మల్లికార్జున, వాణిశ్రీ, రామలింగాదేవి, సునీత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బొమ్మనహాళ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గౌనూరు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం కోసం టీడీపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున రూ. 20వేలను విరాళంగా ఇచ్చారు. ఆలయంలో బుధవారం కమిటీ సభ్యులకు నగదును అందజేశారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

రాయదుర్గంరూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం బార్ అసోషియేషన్ ఎన్నిక బుధవారం రాత్రి ఏకగ్రీవంగా జరిగింది. పట్టణంలో జరిగిన ఈ ఎన్నికలలో నూతన అధ్యక్షుడిగా హెచ్ మల్లేశప్ప, ప్రధాన కార్యదర్శిగా ఈసీ వన్నూరుస్వామిలను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పృథ్వీరాజ్, ట్రెజరర్‌గా రాజశేఖర్‌రెడ్డి, లైబ్రరీ కార్యదర్శిగా రేణుక, వైస్ ప్రెసిడెంట్‌గా డీ రవిచంద్ర, గౌరవ అధ్యక్షుడిగా జీ లోకానందను ఎన్నిక చేశారు. నూతన సభ్యులు మాట్లాడుతూ బార్ అసోషియేషన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడిపత్రి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి గ్రామం వద్ద రెండురోజులు క్రితం గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో గాయపడ్డ ధనలక్ష్మి (34) చికిత్స పొందుతూ బెంగళూరులో బుధవారం మృతి చెందిందని రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని భగత్ సింగ్‌నగర్‌కు చెందిన ధనలక్ష్మి, రాజకుళ్లాయప్ప దంపతులు రావివెంకటాంపల్లి సమీపంలోని సాయిభవిత పాఠశాలలో చదువుతున్న కుమారుడు వెంకటఅఖిల్‌కు ఆహార పదార్థాలు ఇచ్చి తిరిగి వస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఇరువురు తీవ్రగా గాయపడ్డారు. ధనలక్ష్మి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తుండేవారు. రాజకుళ్లాయప్ప పెట్రోల్ బంకులో కార్మికుడిగా పని చేస్తుండేవారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి కార్మిక సంఘం జిల్లా నాయకులు నివాళులర్పించారు.

హైటెన్షన్ వాతావరణంలో కౌన్సిల్ సమావేశం

● మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు

రాయదుర్గంటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గత మున్సిపల్ సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్‌చైర్మన్ వలీబాషాకు సంబంధించిన కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయి గొడవ జరిగిన నేపథ్యంలో బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించగా.. హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ముందస్తు చర్యల్లో భాగంగా అర్బన్ సీఐ జయనాయక్, ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐ స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు చేపట్టారు. మహిళా కౌన్సిలర్ల భర్తలను కార్యాలయంలోకి అనుమతించకుండా ఆంక్షలు విధించారు. దీంతో మహిళా కౌన్సిలర్లు ఏమిటి ఇలా చేస్తున్నారని సీఐతో కొద్దిసేపు వాదనకు దిగారు.

సమస్యలపై ఏకరవు పెట్టిన కౌన్సిలర్లు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షత వహించారు. ఇందులో ఆయా వార్డుల కౌన్సిలర్లు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముందుగా అజెండాలోని 1, 2 అంశాలను వాయిదా వేసి ఇతర అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిలర్లు పద్మజ, శ్రీలక్ష్మి, గోవిందరాజులు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటిఎద్దడి లేకుండా చూడాలని, డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయించాలని, ఫాగింగ్ మిషన్లు మరమ్మతులు చేయించి వీధుల్లో ఫాగింగ్ చేయించాలని, వీధిదీపాలు ఏర్పాటు చేయించాలని కోరారు. వెంటనే సమస్యల్ని పరిష్కరించాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

గుత్తిలో కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ వన్నూరబీ అధ్యక్షతన, కమిషనర్ జబ్బర్‌మియా సమక్షంలో జరిగింది. ఇందులో అధికారులు అజెండా చదువుతుండగా కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించలేనప్పుడు ఎందుకు ఈ సమావేశాలు అంటూ నిట్టూర్చారు. సమస్యలు ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కావడం లేదని మండిపడ్డారు. మున్సిపాలిటీలో తాగునీరు, పారిశుధ్య సమస్యలతో పాటు వీధుల్లో కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పుడుతున్నారన్నారు. వెంటనే పరిష్కరించాలని నిలదీశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారి మారుతిప్రసాద్, మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబుబ్‌బాషా, ఏఈ కిరణ్, వైస్‌చైర్‌పర్సన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెబుతావా.. చెప్పుకో!

● దళిత రైతుకు లైన్‌మన్ బెదిరింపు

పుట్లూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తన గురించి ఎమ్మెల్యేకు చెబుతావా.. చెప్పుకో అంటూ ఓ దళిత రైతును లైన్‌మెన్ బెదిరించాడు. మండలంలోని సూరేపల్లిలో దళిత రైతు కుళ్లాయప్ప రెండు ఎకరాల్లో మామిడిచెట్లు సాగు చేశాడు. పదిరోజుల క్రితం లైన్‌మెన్ అకారణంగా ఆ తోటకు విద్యుత్ లైన్‌ను కట్ చేశాడు. దీంతో బాధిత రైతు పలు మార్లు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని వేడుకున్నా లైన్‌మెన్ పట్టించుకోలేదు. మామిడి చెట్లు ఎండిపోతున్నాయంటున్నా.. అదిగో.. ఇదిగో అంటూ సాకులు చెబుతున్నాడు. రెండురోజుల కిందట మండలకేంద్రానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రావడంతో కుళ్లాయప్ప వెళ్లాడు. అది తెలుసుకున్న లైన్‌మెన్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లావా.. పోయి చెప్పుకో అని బెదిరించినట్లు సమాచారం. ఫిర్యాదు చేయలేదు అంటున్నా.. కనెక్షన్ ఇచ్చేదేలేదు. నీ ఇష్టం వచ్చిన వాళ్లకు చెప్పుకో అంటూ చిందులు తొక్కినట్లు తెలిసింది.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


కైరేవులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శెట్టూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరేవు, యాటకల్లు గ్రామాల్లో రెండో విడత రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి సిబ్బందికి ఆదేశించారు. ఆయా గ్రామాల్లో బుధవారం ఆయన సిబ్బంది, రైతులతో కలిసి భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. రీసర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. రీసర్వే ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని, ముందుస్తుగా భూ యజమానులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

● వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు


ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నేత దేవినేని ధర్మతేజ

కళ్యాణదుర్గం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్‌విందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విందులో పాల్గొన్నారు. టీడీపీ నేత దేవినేని ధర్మతేజ భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అమిలినేని విజయవాడ నుంచి సీసీ కెమెరాల ద్వారా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.

అక్కమాంబ జాతర ఏర్పాట్ల పరిశీలన

కళ్యాణదుర్గం: ఉగాది పండగను పురస్కరించుకుని పట్టణంలోని అక్కమాంబ ఆలయం వద్ద నిర్వహించే జాతర ఏర్పాట్లను టీడీపీ నేత ధర్మతేజ పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారులతో మాట్లాడారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పద్మావతి, తహసీల్దారు భాస్కర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, ఈవో దేవదాస్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

తాడిపత్రి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పలుశాఖల అధికారులు హాజరైనప్పటికీ.. ప్రజాప్రతినిధులు మాత్రం సమస్యలపైన దృష్టిపెట్టకుండా వచ్చి వెళ్లి పోయారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నప్పటికి ప్రజాప్రతినిధులు సమావేశంలో లేవనెత్తకపోవడంపై కొందరు ప్రజాప్రతినిధులు చర్చించుకోవడం కనిపించింది. కొద్దిమంది మాత్రం పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్‌బాషా, వైస్ ఎంపీపీ రమాదేవి, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య


జె.నారాయణ (ఫైల్)

కూడేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.నారాయణపురం గ్రామ రైతు జె.నారాయణ (80) ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో ఆయన ఉరి వేసుకున్నాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు నారాయణకు నాలున్నర ఎకరాల పొలం ఉంది. పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.5 లక్షల వరకు ఉన్నాయి. ఒత్తిడి తాళలేక మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. భార్య లక్ష్మక్క బుధవారం ఉదయం చూసేసరికి మృతి చెందారు.

రాష్ట్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే అశ్మిత్


నరసాపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, మార్చి26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నరసాపురం, వెంకన్నపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి అక్కడి ప్రజలతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. సమస్యలు ఉంటే తెలపాలని గ్రామస్థులను కోరారు. పలువురు వివిధ సమస్యల్ని వివరించగా.. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గడిచిన 10నెలల్లో నరసాపురం గ్రామ పంచాయతీలో రూ.32లక్షల వ్యయంతో, వెంకన్నపల్లి గ్రామ పంచాయతీలో రూ.7 లక్షల వ్యయంతో సీసీరోడ్లు వేశామని తెలిపారు. అలాగే గ్రామ ప్రజలు దాహార్తిని తీర్చేందుకు సబ్ మెరిసిబుల్ మోటార్ పంప్‌సెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శకుంతల, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, నాయకులు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తిచేయండి

తాడిపత్రి: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆలయం వద్ద జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయంలో కల్యాణ మండపం, ప్రహరీగోడలు మరమ్మతులు ఉండడంతో పురావస్తు అధికారులతో మాట్లాడి పనులు ప్రారంచామని తెలిపారు. పనులు త్వరగా పూర్తిచేయాలని, ఏదైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తేవాలని తెలిపారు. వందల ఏళ్ల నాటి ఆలయాలను కాపాడుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యల్లనూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచివారి పల్లిలో బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలోప్రజాదర్బార్ జరిగింది. ఇందులో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులు అందజేశారు. వాటిని ఎమెల్యే స్వీకరించి పరిశీలించారు. సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆయా అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ అందరి సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు కూచివారిపల్లి వేణుగోపాల్‌నాయుడు, కొత్తపల్లి శరత్చంద్రనాయుడు, బొప్పేపల్లి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

ఉరవకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలలో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఎస్ సింధుభార్గవి, ప్రతిభ ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థులు రాహిత్ కుమార్, నిఖిల్, వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యశస్విని ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక

పెద్దవడుగూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులపై జరిగిన సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించేందుకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో సామాజిక తనిఖీ బృందం ఉపాధి పనులపై చేపట్టిన తనిఖీ నివేదికలను అధికారులకు వినిపించారు. మండలంలో 1015పనులు రూ.14.48కోట్ల వ్యయంతో జరిగాయన్నారు. రూ.42వేలు ఉపాధిహామి సిబ్బంది నుంచి రికవరీ చేయాలని అధికారులకు సూచించారు. పీడీ సలీంబాషా, ఎంపీడీఓ బారెన్‌సాబ్, ఏపీఓ పుల్లారెడ్డి ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులపై భారీ రాయితీ

● 50 శాతం మినహాయింపు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

కళ్యాణదుర్గం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించినట్లు కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణభార్గవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-2025వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నులను పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీపై 50 శాతం రాయితీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను ఈ నెల 25వ తేదీన విడుదల చేసిందన్నారు. కావున ఆస్తి పన్ను చెల్లింపుదారులకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు ఆన్‌లైన్‌లో కానీ ఈనెల 31 లోపు ఏకమొత్తంగా చెల్లించి వడ్డీ మాఫీని పొందాలని సూచించారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పన్నులు కట్టించుకుంటామని తెలిపారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

కణేకల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న ఎంపీపీ రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడిందని, అందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని అన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్నిక జరుగుతుందని చెప్పారు.

● రాయదుర్గంరూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండన్న ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

బేటీ బచావో.. బేటీ పడావో

పామిడి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీలో బుధవారం బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ పాల్గొని మాట్లాడారు. బాలికలను అన్నిరంగాల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ప్రతి ఆడపిల్ల బాగా చదవాలని సూచించారు. అనంతరం లింగ నిర్ధారణ యాక్ట్, బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. తర్వాత పాఠశాల ప్రాంగణంలో మానవహారంగా నిలిచి పలు నినాదాలు చేశారు. కేజీబీవీ ఎస్ఓ సౌభాగ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్రావ్ తదితరులు పాల్గొన్నారు.